## మహాకాలుని ప్రేరణ - అతి ముఖ్య సూచన

క్రాంతి ధర్మీ సాహిత్యము అనే పేరుతో ప్రసిద్ధి గాంచిన ఈ పుస్తకమాల క్రాంతిదర్శీ ప్రజ్ఞాపురుషుడు పండిత శ్రీరామశర్మఆచార్య గారిద్వారా 1989 నుండి1990 మధ్య కాలములో తమ మహాప్రయాణమునకు ఒక సంవత్సరము ముందు ఒక ప్రవాహముగా సృజించబడినవి. ఇరవై చిన్న చిన్న పుస్తకములుగా వున్న ఈ సాహిత్యము గురించి మన ఆరాధ్య పరమపూజ్య గురుదేవులు (పండిత శ్రీరామశర్మఆచార్యగారు) ఇలా వివరించారు – " ఇవి నా విచారక్రాంతి యొక్క బీజములు. ఇవి కొద్దిగా అయినా సరే విస్తరింపబడితే మనుష్యులును కుదిపివేస్తాయి. సంపూర్ణ విశ్వము యొక్క పటము (MAP) నే మార్చివేస్తాయి". నిజానికి ఈ పుస్తకములలో కేవలము ఆలోచనలే కాదు ఒక మహాక్రాంతి యొక్క జ్వాల లేక మంట వున్నది. యుగపరివర్తన దిశ నిర్ధారింపబడింది.

యుగఋషి తమ జీవితమంతా, జీవించే కళ నుండి నిగూఢ ఆధ్యాత్మిక విషయములు మరియు సమాజనిర్మాణము నుండి వైజ్ఞానిక–ఆధ్యాత్మిక ప్రధానమైన సమగ్ర సాహిత్యము ఏదయితే రాస్తూ వచ్చారో దానిని మొత్తము త్రాసులో ఒక తక్కెడలో పెట్టి రెండవ వైపు సూత్రప్రాయముగా వ్రాయబడిన ఈ పుస్తకములను పెడితే వీని బరువే ఎక్కువ. ఈ అమూల్య సాహిత్యాన్ని ఎవరైనా లాభమువద్దు, నష్టమువద్దు (NO PROFIT-NO LOSS) పద్ధతిన అచ్చుగుద్ది వ్యక్తివ్యక్తికీ అందచేయమనే నిర్దేశము గాయత్రీపరివార్ యొక్క అధిష్టాత పరమపూజ్య గురుదేవులు స్వయముగా ఇచ్చారు. వీటిని ఎవరైనా ప్రచురణ చేయవచ్చు, ఎవరికైనా పంచవచ్చు. వీటిని ఎంత ఎక్కువమంది వ్యక్తులకు ఏ పాఠకుడు, పరిజనుడు అందచేయగలడో అతను అంత ఎక్కువ పుణ్యాన్ని పొందగలడు.

*Global Head Quarters :* **GAYATRI TEERTH**
*Shanntikunj, Haridwar, Pin- 249411*
*Phones: (0133)2460866, 2461955, 2460309*
*Phones: (0133) 2460866 E-mail : shail@del2vsnl.net.in*
*website : www.gayatripariwar.org, www.awgp.org*

మహాపూర్ణాహుతి పుస్తకమాల - 4

# యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము - 2



పండిత శ్రీరామశర్మ ఆచార్య

బాధ్యత, ధైర్యము, నిజాయితీ, వివేకములను నా జీవితములో అవిచ్ఛిన్నమైన అంగములుగా అభివృద్ధి చేసుకుంటాను

మహాపూర్ణాహుతి పుస్తకమాల - 4

# యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము- 2

హిందీ మూలరచన :

వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట

**పండిత శ్రీరామశర్మఆచార్య**

అనువాదము :

**డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ**

ఎమ్.ఎస్‌సి, పిహెచ్.డి.

ముద్రణ

**గాయత్రి చేతనా కేంద్రము**

అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్,

హైదరాబాద్-500018.

ఫోన్స్ : 040-23700722, 32986922, 09392506888

E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | జీవనీశక్తి యొక్క దృశ్యమాన చమత్కారములు | 1 |
| 2. | మనోబలము యొక్క ప్రచండ శక్తి మరియు దానియొక్క పరిణతి | 8 |
| 3. | ఆత్మబలమే సర్వోపరి | 19 |
| 4. | ప్రతిభాసంవర్థనకు రెండు ఆధారాలు సాహసము - సువ్యవస్థ | 29 |
| 5. | విశిష్టత యొక్క సునియోజనము | 37 |
| 6. | ఈ విశ్వములోని అతి పెద్ద శక్తి | 45 |
| 7. | ప్రతిభ అనగా తేజస్విత అనగా తపశ్చర్య | 52 |
| 8. | ప్రతిభా సంవర్ధన కొఱకు నిర్ధారింపబడిన విజ్ఞాన సమ్మతమైన ప్రయోగ ఉపచారములు | 61 |

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్.

# యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము - 2

## సంక్షిప్తసారము

గొప్ప గొప్ప పనులను పెద్ద పెద్ద శక్తి కేంద్రాలే చేయగలవు. బురదలో దిగబడిన ఏనుగును మరియొక బలమైన ఏనుగు మాత్రమే పైకి లేపగలదు. పట్టాలు తప్పిన రైలు ఇంజనును లేపడానికి సామర్థ్యము కలిగిన క్రేన్‌ను మాత్రమే ఉపయోగించాలి. అల్లకల్లోలంగావున్న సముద్రములో సాహసవంతులయిన నావికులు మాత్రమే నావను నడుపగలరు. నేటి సమాజము లేదా ప్రపంచమున పెద్ద సమస్యలను పరిష్కరించడానికి స్రష్టకు కూడా వరిష్ఠులైన పరిష్కృత ప్రతిభావంతుల ఆవశ్యకత ఉన్నది. ప్రతిభావంతులు ఎటువంటి సంపదలంటే వారిద్వారా కేవలము వ్యక్తిగత శ్రేయస్సే కాక మన క్షేత్రములలోని సమూహముల యొక్క మరియు దేశము యొక్క అత్యంత భయానకముగా కనిపించే సమస్యలన్నింటిని సులభముగా తొలగించగలరు. ఈ కారణముగానే వీరు దేవదూతలని - దేవమానవులని - మహాపురుషులని పిలువబడతారు.

ఈరోజులలోని అసంతులనమును సంతులనముగా మార్చుటకు మహాకాలుడు ఒక పెద్ద యోజనను తయారుచేశాడు. ఈ కార్యము ఆదర్శవాదులైన సహాయకుల ఉప్పొంగే

పురుషార్థాలను ఉత్సాహపరిచి, వారిని ఒకే సూత్రములో బంధించుట మొదలు అనీతి-దుష్ప్రవృత్తులకు విరుద్ధముగా పోరాడుటకు నియమిత సృజనాత్మక గతివిధులు-సత్ప్రవృత్తులు గల ఒక పెద్ద సైన్యమును తయారుచేసే రూపములో మొదలుపెట్టబడింది. దీనితో ప్రతిభావంతుల మూర్ఛిత స్థితి తొలగింపబడి ఒంటరిగానే ముందుకు ఉరికి తమ సామర్థ్యములను నిరూపించుటకు ప్రేరణ కలిగించే మహాజాగరణ ప్రక్రియ జరుగుతుంది. నవయుగఅరుణోదయము చాలా దగ్గరలో వుంది. సత్యయుగమునకు అవసరమైన సునిశ్చితసంభావనలు తయారవుతున్నాయి. ప్రతిభా ధనము కలవారే ఈ లక్ష్యమును పూర్తిచేసి చూపించగలరు.


**యుగశక్తి గాయత్రి**

**వ్యక్తిత్వ నిర్మాణ మాసపత్రిక**

సం॥ చందా : రూ. 90/-లు 3 సం॥లకు : రూ 250/-లు

10సం॥లకు : రూ. 750/-లు ఆజీవన చందా: రూ. 1800/-లు

పూర్తి వివరములకు

**గాయత్రి మాత మందిరము మరియు ధ్యానకేంద్రము**

**అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్, హైదరాబాద్-500018.**

ఫోన్స్ : 040-23700722, 32986922, 09392506888

E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com




## 1. జీవనీశక్తి యొక్క దృశ్యమాన చమత్కారములు

మోటారు యొక్క మూస లోహముతో తయారవుతుంది. దాని చక్రములలో రబ్బరు, సీట్లకు రెగ్జిన్, కిటికీలకు గాజును అమరుస్తారు. ఇది సరియైనదే అయినప్పటికీ దాని యొక్క పరిగెత్తేశక్తి, ప్రక్కకుతిరిగేశక్తి, వెనుకకు తిరిగే శక్తులన్నీ పెట్రోలు, బ్యాటరీ, డైనమోల ఆధారముగా తయారైన అగ్ని - విద్యుత్తు శక్తిపైనే ఆధారపడివుంటాయి. దాని యొక్క వేగము మొదలైనవాటికి అవే కారణమౌతాయి. పెట్రోలు లేకపోయినా, బ్యాటరీ ఫ్యూజ్ పోయినా, అది ఆకారములో ఎంతో గొప్పదైనా కదలలేదు. శరీరము యొక్క సంరచన కూడా మోటారు వంటిదే. చూడడానికి ఎముకలు, మాంసము, రక్తము, చర్మము మొదలైనవానితో తయారైనట్లు కనపడుతుంది, కానీ దాని యొక్క అంతర్, బాహ్య కదలికలు ప్రాణవిద్యుత్తు పైననే ఆధారపడివుంటాయి.

ప్రాణము పోయిన తరువాత చక్కగా, లావుగా, దృఢముగా వున్న శరీరం కూడా చూస్తూండగానే నిర్జీవమవుతుంది. స్పందనాగిపోయిన మరుక్షణమే మృత్యువు వరించి, అంతకుకొంత సమయము ముందువరకు ఏ శరీరము అయితే ప్రబల పురుషార్థము చూపించిందో ఆ శరీరము కాల్చుట లేక పూడ్చుట చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. దానికి అంత్యేష్ఠి జరుగకపోతే కొలది సమయములోనే అది దానంతటదే క్రుళ్ళి, నశించే ప్రక్రియకు లోనవుతుంది. జీవించియున్నంతవరకు దూరముగా ఉన్న నక్కలు, గ్రద్దలు, తోడేళ్ళు మొదలయినవి వాసన తగలగానే పరిగెడుతూ వచ్చి ఆ శవాన్ని తమ ఆహారంగా చేసుకుంటాయి.

**బాహ్యాముగా చూడటానికి చేతులు-కాళ్ళు, ముక్కు-చెవులు మొదలైనవి శరీరములో పనిచేస్తూ కనపడినా వాస్తవానికి జీవితము ఆంతరికఊర్జపైనే ఆధారపడి వుంది.** అదృశ్యఊర్జ - జీవనీశక్తి, చేతన, ప్రాణవిద్యుత్తు మొదలైన పేర్లతో పిలువబడుతుంది. అది జీవితమును నడిపించుటకు, అన్నిరకాల కదలికలకు అధిష్ఠాత్రి. ఆరోగ్యసంతులనము, పురుషార్థమును చూపించే పరాక్రమము అన్నీ దీని పైనే ఆధారపడి వుంటాయి. అది గొప్పగా వుంటే మానవుడు ఒకదాన్ని మించిన మరొక పరాక్రమములు చూపించగలుగుతాడు. కానీ అందులో కనుక దౌర్బల్యము, న్యూనతల వంటి వికృతులు పెరుగుట మొదలైతే శారీరిక, మానసికరోగములు మనిషిని చూస్తూండగానే పట్టి పీడిస్తాయి.

చికిత్సకులు రోగనివారణ లేక దుర్బలతను పోగొట్టుటకు తమ తమ పద్ధతులలో వైద్యము చేస్తారు. ఆయుర్వేదము వాత, పిత్త, కఫములే అసంతులనకు కారణముగా చెప్తుంది. హకీములు దానినే ఆది, బాది, ఖాది ప్రకృతులుగా పిలుస్తారు. హోమియోపతిలో విషంతోనే విషాన్ని నయం చేస్తారు. బయోకెమికల్‌వారు కొన్ని లవణాల లోటును ప్రధానకారణముగా చెప్తారు. క్రోమోపతిలో రంగుల అసంతులనము మూలకారణముగా చెప్తారు. ఎల్లోపతివారు విషాణువుల ఆక్రమణ అంటారు. చికిత్సా విధానమును బట్టి మారక లేదా శామక ఓషధులు ప్రయోగిస్తారు. పరిణామముగా అప్పటికప్పుడు చమత్కారము చూపుట మినహా మరేమీ జరుగదు. ఈరోజులలో ప్రశిక్షితులైన చికిత్సకులు ముందుకు వస్తున్నారు. ఇక తమ అనుభవమును గురించి దండోరా వేసుకునే లెక్కలేనంతమంది ఉపచారకుల గురించి ఏమి చెప్పగలము? ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు క్లినిక్‌లు, దవాఖానాలు అన్య ఉద్యోగములతో పోలిస్తే చాలా వేగముగా తెరువబడుతున్నాయి.



దానితోపాటే రోగుల సంఖ్య కూడా ఎంత వేగముగా పెరుగుతున్నది అంటే ప్రపంచములో రోగములేని వ్యక్తి ఎవరూ లేడా అనిపిస్తుంది.

రోగనివారణ అందరూ చేస్తారు, ఆ వైద్యము కొద్దిరోజులపాటు మాత్రమే పనిచేస్తుంది. తర్వాత అన్ని ఉపచారములు నిరర్థకమౌతాయి. రోగులు, ఒక వైద్యుని నుంచి మరొక వైద్యుని వద్దకు పరిగెడుతూ మృత్యువు వచ్చేవరకు తిరుగుతున్నారు. వైద్యులు ఈ స్థితిని చూసి సంతృప్తి చెందుట లేదు. పాతమందుల గొప్పతనమును తిరస్కరించి వారు క్రొత్త క్రొత్త మందులు కనిపెడుతూ, ఉత్సాహముతో తమ పరిశోధనల గురించి దండోరా వేసుకుంటున్నారు. ఇన్ని జరిగినా పరిస్థితులు అలానే ఉన్నాయి.. పర్యవేక్షణకర్తలు ఒకే స్వరముతో చెప్తున్నది ఏమిటంటే క్రొత్త క్రొత్త రోగాల సంఖ్య ఎంత వేగముగా పెరుగుతూవున్న దంటే వైద్యరంగములోని ప్రముఖు లందరూ ఏమి చేయ్యాలో తోచక తమ పరాజయాన్ని స్వీకరించే బదులు వారు శక్తివంతమైన విషాణువులు తుఫానులాగా వ్యాపిస్తున్నాయనీ, వాతావరణ మార్పు, వ్యాధిగ్రస్తులు నియమాలను ఉల్లంఘించడము మొదలైన అనేక దోషాలను రోగులపై రుద్ది తమ అపజయము మీద తెర వేసే ప్రయత్నము చేస్తారు.

పూర్వకాలములో జలుబు, దగ్గు, ఆయాసము వంటి పరిమితమైన రోగాలుండేవి. కానీ ఈనాడు జబ్బుల వర్గీకరణ పెద్ద-పెద్ద రోగముల జాబితా రూపములో తయారయింది. వాటివలన వచ్చే భయంకర పరిస్థితులు కూడా చాలా విపరీతముగానే వున్నాయి. అల్సరు, మధుమేహము, బి.పి. మొదలు కాన్సరువంటి భయంకరవ్యాధుల సంఖ్య పెరిగిపోతోంది. రోగమునిదానిస్తుందని కానీ, తగ్గుతుందని కానీ ఎదురుచూస్తే నిరాశే మిగులుతున్నది. జలుబు, దగ్గు, నిద్రలేమి వంటి రోగాల గురించి ఏమి చెప్తాము? అవి ఫ్యాషన్ల రూపములో అనేకులపై

తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడము చూస్తూనే వున్నాము. వైద్యము చేసేవారు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవటానికి, తమ నియమిత కార్యక్రమములు జరగటానికి, తమ ఉపచారముల గురించి, గొప్పగా ప్రశంసించుకుంటూ తమనుతాము కాపాడుకుంటున్నారు, కానీ సత్యము మొండిపట్టు పట్టి అడుగుతున్నది -'చికిత్సావ్యవస్థ తూఫాను వేగముతో ముందుకు పోతూవుంటే, సర్వసాధారణులకు ఆరోగ్యము రక్షించబడే అభయము ఎందుకు దొరుకుట లేదు?'

ఈ అసమంజస పరిస్థితిని నివారించడానికి కొంత లోతుకి వెళ్ళవలసిన అవసరము వున్నది. పరిశోధనల అంతిమ నిర్ణయముగా వెలువడబోయే నిజమేమిటంటే తరిగిపోతున్న జీవనీశక్తి, వ్యాధులను ఆహ్వానిస్తుంది. ఈ స్థితి నిజంగా దయనీయమైనది. రోగిని అపరాధి అని చెప్పక కనీసము అభాగ్యుడు అని చెప్తే బాగుంటుంది. అతడు జీవితము యొక్క వాస్తవిక లాభమునుండి, ప్రగతిశీలత యొక్క రసాస్వాదననుండి దాదాపు వంచితుడే అవుతున్నాడు. ఈ పరిస్థితి విచారించదగినది. ఎందుకంటే ప్రజలు ఎప్పుడుపడితే అప్పుడు తీవ్రమైన లేదా స్వల్ప శారీరిక రోగాలతో సతమతమౌతున్నారు.

**మానవుని దౌర్భాగ్యానికి, క్షీణతలకు, రుగ్మతలకి ప్రముఖ కారణము బలహీనపడి, తరిగిపోయిన, ఆంతరిక వికృత జీవనీశక్తియే అని చెప్పుట వుచితము.** ప్రస్తుతము ఇదే క్రమము జరుగుతున్నది. ఆరోగ్యపరముగా ప్రజలు రోజురోజుకి బలహీనులుగా మారుతున్నారు. అనారోగ్యమే ఈనాటి పెద్ద సమస్య. దాని కారణముగానే పురుషార్థమునకు, ప్రగతికి, అభివృద్ధికి కావలసిన సత్పరిణామములు పొందుట కష్టమగుచున్నది. ఇతరుల సహాయము కొరకు ఎదురుచూసేవారు, స్వావలంబన లేనివారు ఏవిధంగా ప్రగతి సాధించగలరు?

ఈ సత్యాన్ని ఎవరు గ్రహించినా గ్రహించకపోయినా



జీవనీశక్తితక్కువగా వుండడము వలననే మానవుడు జీవించివున్నప్పటికీ పూర్తి చచ్చినట్లు కాక సగము చచ్చినవానివలె కొనసాగుతున్నాడు. శరీరము చూడటానికి బాగానే వున్నప్పటికీ నిర్జీవంగా, నిస్తేజంగా, తెలివైన మనస్సున్నప్పటికీ కష్టాలలోనుండి బయటపడలేని అసమర్థతతో, ముందుకు సాగాలనే ప్రయత్నము చేస్తూ కూడా అపజయము పాలవుతున్నది. ఊర్జయొక్క తరిగిపోతున్న నిష్పత్తియే వీటన్నిటికీ కారణము. ఆ ఊర్జయే ప్రసన్నతకు, ప్రఫుల్లతకు, సమర్థతకు మరియు విజయానికి జన్మనిచ్చే తల్లి. **శారీరక బలహీనతలు, అనారోగ్యము, నిరాశ, ఉద్విగ్నతలకు ప్రత్యక్షముగా కనిపించే కారణములేవైనా నిజము మాత్రము జీవనీ శక్తి తగ్గడమే.** ఈ కారణముగానే ఈ పరిణామాలు ఏర్పడుచున్నవి. మూలకారణము కనుక్కొని దానిని తొలగించనంతవరకు ఈ శరీరక్షేత్రము బలహీనముగా వుండడము మొదలుకొని మానసిక బాధలు, కష్టముల నుండి విముక్తి పొందడము అసంభవము. కానీ కొంతసేపు ఇదంతా అబద్ధము అని మనస్సుని సంభాళించుకొనుట వేరే విషయము.

శరీరము, మనస్సుల వరకే జీవితము పరిమితము కాదు, దానిలో అడుగడుగునా అవరోధాలను ఎదుర్కొనక తప్పదు మరియు తనదైన శైలిలో తన ప్రగతి కొరకు మార్గము స్వయముగా తానే తయారుచేసుకోవాల్సి వుంటుంది. ఇందుకొరకు కావలసిన శక్తి సామర్థ్యాలు లేనిచో కొద్దో, గొప్పో చేసినందువలన పని జరగదు. కింకర్తవ్యతావిమూఢుడై, హతాశుడై ఎక్కడున్నవారు అక్కడే నిలబడిపోవల్సివస్తుంది. శ్వాసపీల్చుకునే పనిని కుమ్మరివాని తిత్తి కూడా చేస్తుంది. గోధుమను తిని పిండిని క్రిందికి పంపే పని తిరగలి కూడా చేస్తుంది. గానుగకు కట్టిన ఎద్దు కూడా నూనెను తీయడానికి నానాయాతన పడుతుంది. శ్మశానములోని భూతాలు ఒంటరిగా

వెళ్ళేవారిని భయపెట్టడము, బాధించడము వంటి పనులు చేస్తూనే వుంటాయి. కానీ ఈవిధమైన పనులు సృష్టికే మకుటాయమానమైన అసాధారణ శక్తిసామర్థ్యము కల మానవునికి శోభనివ్వవు. ఇతరులకి తోడ్పడి ప్రగతిశీల కార్యక్షేత్రంలో చేసే పనివలన ఇతరులకు ఉన్నతంగా, అనుకరణీయంగా, అభినందనీయముగా ఉండ గలిగినప్పుడు మాత్రమే అతనికి యోగ్యత, సౌభాగ్యము, గౌరవము లభిస్తుంది. కానీ ఇటువంటి ప్రగతిశీలత ఏ క్షేత్రములోనైనా ఎప్పుడు ఆంతరికఊర్జ తోడు లభిస్తుందో అప్పుడు మాత్రమే సంభవమౌతుంది. **జీవనీ శక్తి యొక్క పరిణతి ఓజస్సు, తేజస్సు, వర్చసులుగా వున్నచో అతను వికాసము చెందే వ్యవస్థ తయారవుతుంది.**

మానవీయశక్తి మూడు భాగాలుగా వుంటుంది - శరీరము, మస్తిష్కము మరియు అంతఃకరణ. వీనినే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలుగా చెప్తాము. వీనియందు పనిచేసే శక్తే ప్రాణాగ్ని, లోగోస్, బయోఎలక్ట్రిసిటీ, జీవనీశక్తి, విద్యుత్తు చేతన మొదలైన పేర్లతో తెలుపబడుతుంది. ఇవి క్రమముగా ఓజస్సు, తేజస్సు, వర్చస్సుగా చెప్పబడతాయి. వాటి సామాన్యసంతులన ఆరోగ్యము పేరుతో తెలియుచున్నది. దీనిని సరియగు స్థితిలో వుంచడమే ఆరోగ్యపరిరక్షణ, సమర్థత, బలము మొదలగు పేర్లతో తెలియుచున్నది. ఆంతరికస్థాయిలో దాని సునియోజనము ప్రతిభరూపములో ప్రకటమౌతుంది. దానిని వ్యర్థపరుచుట లేదా నిలుపుకొని ప్రఖరముగా తయారుచేసుకొనుట అనేది మనిషి చేతిలోనే వున్నది. ఈ ప్రక్రియ బయటనుండి వచ్చే సహాయముపై ఆధారపడివుండదు. భాగ్యము, వారసత్వము, శాపాలు లేదా వరదానాలు అనేవి ఇందులో పనిచేయలేవు. వెనుక చేసిన కర్మ ఈనాడు భాగ్యరూపములో సుఖదుః ఖాలను అందివ్వగలదు. ప్రతిభావంతుడు దుఃఖాన్ని కూడా వికాసానికి



ఆధారముగా భావిస్తాడు, కానీ బద్ధకస్తుడు సుఖమును కూడా పతనమునకు కారణముగా తయారుచేసుకుంటాడు. జీవనీశక్తి యొక్క ప్రాణాగ్ని వికాసప్రక్రియ అన్ని స్థితులలోనూ కొనసాగించవచ్చు..

ఆరోగ్యమునకు ఇదే ఉద్గమస్థానము. నరాలు-నాడులు, మాంసపేశికలు, జీవకోశికలలో దీని ప్రభావమే పని చేస్తూవున్నది. రోగనిరోధకశక్తి అంటే ఇదే. దీనిని టానిక్‌లాగా బలవర్ధకమైనదిగా చూడవచ్చు. మస్తిష్కములో బుద్ధి, దూరదర్శిత, సూక్ష్మనిరీక్షణా సామర్థ్యము దీని యొక్క చమత్కారములే. వరిష్ఠులైన, సాహసికులలో, వైజ్ఞానికులలో, కళాకారులలో మరియు విశిష్టవ్యక్తులలో ఈ శక్తే పనిచేస్తూ కనపడుతుంది. అంతఃకరణలో భావసంవేదనల రూపములో ఇదే కనపడుతుంది. కరుణ, సహిష్ణుత మరియు ఆదర్శవాదిత వంటి మెచ్చుకోదగిన పనులలో దీని గరిమ యొక్క పరిచయమే మనకు లభిస్తుంది. ఇది శరీరములో తక్కువగా వుంటే, ఆ వ్యక్తి రాబోయేరోజులలో రోగగ్రస్తుడవుతాడు, అశక్తుడై తనకు తాను దుర్బలముగా, వ్యాధులతో పీడింపబడి మూలుగుతూ వుంటాడు.

మస్తిష్కములో దీని శాతము తక్కువగా ఉంటే వారు అస్తవ్యస్తముగా, విద్యలేనివారుగా అసభ్యతతొ, అర్ధవిక్షిప్తులుగా నీచస్థాయిలో గణింపబడతారు. బోళాగా, అమాయకంగా వుండే స్వభావము వలన వారు తప్పులు చేస్తు అపార్థాలకు బలిఅవుతారు. సభ్యతగలవారికి శోభనివ్వని ప్రవర్తన ఉంటుంది. అంతఃకరణ దృష్టితో చూస్తే తక్కువ జీవనీశక్తి గలవారు నిష్ఠురులుగా, నీరసముగా, ప్రేమలేనివారుగా, స్వార్థపరులుగా, పతితుల వలె ఆచరణచేస్తూ అవమానాలు, హేళనలు పొందుట చూస్తూవుంటాము. ఎవరిలో ఈ ప్రాణసంపద ఎంత తక్కువగా వుంటే వారు అదే శాతములో అంత దీనులుగా, హీనులుగా వెనుకబడినవారుగా, దరిద్రులుగా,

అభావగ్రస్థులుగా చెప్పబడతారు.

మనము ఈ కనిపించే శరీరాన్ని మాత్రమే చూడడమనేది దౌర్భాగ్యముగానే చెప్పాలి. దీనివెనుక పనిచేసే అదృశ్యసామర్థ్యమునకు ఎటువంటి విలువా ఇవ్వము. దాని గొప్పతనాన్నీ గుర్తించలేము. అనేక అంగ ప్రత్యంగములను నడిపించే, మండించే ఆ విద్యుశ్శక్తిపుంజమును గురించి మరిచిపోయి కేవలము మాంసపుముక్కల యొక్క పుష్టి మాత్రమే చూస్తాము. విద్యుద్ధార కనుక లేకపోతే బల్బులు, ఫ్యానులు, హీటర్‌లు, కూలర్‌లు మొదలైనవి ఎంత సుందరమైనవి, ఖరీదైనవి అయినప్పటికీ తమ పనిని సక్రమంగా చేసుకోలేవు. ఇదేవిధముగా జీవనీ శక్తి అనే సంజీవనీశక్తి కనుక తగ్గిపోతే శరీరము, మనస్సు, అంతః కరణ అన్నీ గందరగోళమైపోతాయి. ముఖ్యముగా, ప్రస్తుతము సర్వత్రా కనిపిస్తున్నట్లు, ఆరోగ్యము నాశనమైపోతుంది.

## 2. మనోబలము యొక్క ప్రచండశక్తి మరియు దానియొక్క పరిణతి

1981 నాటి సంఘటన. ఇంగ్లాండు దేశములో పెట్రిక్‌మేరీ అనే పేరుగల మహిళకు కాన్సర్ వ్యాధి వచ్చింది. వైద్యులు పరీక్షించి కాన్సరు గుండెనుండి శరీరమంతా వ్యాపించింది అని చెప్పారు. చికిత్స కేవలము చిప్పాపూజ మాత్రమే, ఇక ఆమె ఆరునెలల కంటే బ్రతకదు అని చెప్పారు. ఆ మహిళ చాలా బాధపడింది. ఇక దీనికి ఏ విధమైన చికిత్స లేదా? అని ఆమె అడిగింది. మీ యొక్క రోగమును కనీసము కొన్ని నెలల ముందు గుర్తించినట్లయితే కొంత సమయముండేది, అసలు స్థితి అర్థమయ్యేది, అప్పుడు నివారణకు అవకాశము కలిగి మీ



ప్రాణములు రక్షించబడేవి అనివైద్యులు చెప్పారు. ముందే ఎందుకు గుర్తించలేకపోయారు? దీనికి గల ఒకే కారణము ఇంగ్లాండులో ఆ సమయములో 'కాట్‌స్కానింగ్' మిషను ఒక్కటి మాత్రమే వుంది, ఈమె వంతు కొరకు ఇంత సమయము వేచి వుండవలసి వచ్చింది. అప్పటికి సమయము మించిపోయేది. పెట్రిక్ మేరీ కూడా ఆ ఎదురుచూపులలోనే అసాధ్యమైన పరిస్థితికి చేరుకుంది.

అప్పుడు ఆమె ఆలోచించింది, బ్రతికేది ఈ ఆరుమాసాలే అయినప్పుడు ఈ సమయమును శ్రేష్ఠమైన పద్ధతిలో ఎందుకు ఉపయోగించుకోకూడదు? ఆలోచించి, ఆలోచించి ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది, ఇటువంటి అనేక మిషన్‌లు దేశములో పెట్టగలిగే సామర్థ్యము నాకు లేదు, కానీ నా మొత్తము శక్తిని ఈ కార్యముకొరకే వినియోగిస్తే, ఒకటి బదులు రెండు మిషనులు వుంచగలిగితే సగంమంది రోగుల ప్రాణాలైనా రక్షింపబడతాయి. ఆ కాలములో అటువంటి ఒక మిషను 3 కోట్ల రూపాలైతే తప్ప తయారవదు.

పెట్రిక్‌మేరీ పద్ధతిగా ఒక ప్రణాళికను తయారుచేసింది. ఆ దేశములో వున్న టెలివిజన్‌లలో తన పరిస్థితి, దుర్దశను గురించి, జరుగబోయే సంభావనను గురించి ప్రసారము చేసి, దానితోపాటే 3 కోట్ల రూపాయల ఖరీదు చేసే ఆ మిషనును కొద్ది రోజులలో కనుక ఏర్పాటు చేయగలిగితే నాలాంటి వారిలో కనీసము సగంమంది ప్రాణాలైనా రక్షింపబడతాయి అని చెప్పింది. ఆ ప్రసారమును విన్న చాలామంది ఉదారహృదయులు ప్రభావితులై తమ శ్రద్ధానుసారము ఎంత తోస్తే అంత పంపటము మొదలుపెట్టారు. ఆమెకు కాస్త ధైర్యము పెరిగింది, మరియు ఇంకా ఇతర సరంజామాను జోడించుటకు తన పూర్తి మనోయోగమును, సమయమును ఉపయోగించుట మొదలుపెట్టింది. ఫలితముగా నియమిత సమయములోనే రెండవ

మిషను తయారై పనిచేయుటకు అవసరమైన స్థానీయ కార్యకర్తల యొక్క వ్యవస్థ కూడా తోడయింది. కార్యము ప్రారంభించబడింది. ఈ మధ్యలో ఆమె యొక్క తత్పరత, తన్మయత ఎలా వున్నాయంటే అందులో నిమగ్నమై ఆమె తన రోగముగురించి, దాని చికిత్స గురించిన ఆలోచనను వదలివేసింది, తన గురించి తాను ఆలోచించుట మర్చిపోయింది.

సంకల్పించిన కార్యము పూర్తయిన తరువాత తోటివాళ్ళు గుర్తుచేసిన పిమ్మట ఆమె తిరిగి వైద్యుల వద్దకు పరీక్ష చేయించుకోవడానికి వెళ్ళింది. తనకు మిగిలిన ఆరు నెలల జీవితము ఏ స్థితిలో ఉందో తెలుసుకోవడానికి. వైద్యులు ఆమెకు పరీక్షలన్నీ జరిపిన తరువాత, 'ఆమె శరీరములో ఎక్కడా కాన్సరు నామమాత్రము కూడా లేదు, అన్ని విధాలా ఆమె పరిపూర్ణమైన ఆరోగ్యముతో వుంది', అని చెప్పారు. ఈ ఆశ్చర్యకరమైన దానికి కారణమును అన్వేషించుటకు అనేకమంది విశేష ప్రజ్ఞావంతులు ఒక సమితిగా ఏర్పడి సమావేశమైనారు. వారు దీర్ఘకాలము పరిశోధన జరిపిన తరువాత ఒకే ఒక ప్రతిపాదనను ప్రవేశపెట్టారు. ఒకవేళ మానవుడు తన మనోబలముతో మృత్యువును, వృద్ధాప్యాన్ని, అనారోగ్యాన్ని మర్చిపోయి ఉన్నతస్థాయికి చెందిన పరమార్థపు పనులలో మనస్సును నిమగ్నము చేసినపుడు సంపూర్ణ ఆరోగ్యముతో వుండే సామర్థ్యము లభిస్తుంది.

ఈ సంఘటన ఒక ఉదాహరణ మాత్రమే. దీని ఆధారముగా ఒక నిర్ధారణకు రావచ్చును, రోగనిరోధకశక్తి మందులలో, శస్త్రచికిత్సలలో, వైద్యుల నేర్పరితములో ఎంత వుందో అంతకంటే అనేకరెట్ల సామర్థ్యము వ్యక్తి మనోబలములో సన్నిహితమై వుంటుంది, ఖచ్చితంగా దానిని వెలికితీయవచ్చు. ఆలోచనావిధానాన్ని కేవలము సంకల్పశక్తిని పెంచడానికి, అభీష్ట ఉద్దేశ్యములను పూర్తిచేసుకొనుటకు



మాత్రమే కాక పరమార్థప్రయోజనములపై కనుక పెట్టగలిగితే, తనలో వున్న అనంతశక్తిభాండారముతో నవజీవితమును ఉత్పన్నము చేసి వికసింపజేసుకోవచ్చు.

ఇటువంటి సంఘటనలు ఒకటి కాదు, అనేకము వున్నాయి. ఫ్లోరెన్స్‌కు చెందిన ఒక మహిళ ఆరోజులలో నవయువతి. ఆమెకు నిశ్చితార్థము జరిగిపోయింది. వివాహము చేసుకోవలసిన వ్యక్తి విదేశాలకు వెళ్ళిపోయాడు. అతడు తిరిగి రావడానికి సుమారు 20 సంవత్సరాలు పట్టింది. అయినప్పటికీ ఆమె నిరాశపడలేదు, వివాహమెప్పుడైతే అప్పుడు తన శరీరము నవయువతి శరీరము వలె కనిపించాలి అని నిరంతరము ఆలోచిస్తూవున్నది. ఆమె రోజులో ఎన్నోసార్లు అద్దములో తన ముఖము చూసుకుని తన యౌవనము తరిగిపోవుటలేదు, పైగా రోజురోజుకి పెరుగుతున్నది అని అనుకుంటూ వుండగానే 20 సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పటికి ఆమెకు 40 సంవత్సరాలు వచ్చేసాయి, ఆమెకు నిర్ణయింపబడిన వరుడు 20 సంవత్సరాల తరువాత తిరిగి వచ్చాడు. ఆమె యొక్క అందమును చూచి అతడు అత్యంత ఆనందమును పొందాడు. వారిద్దరికి వివాహమైనది, సుఖముగా జీవించారు. ఈ సంఘటన సంకల్పశక్తి యొక్క చమత్కారము మాత్రమే.

పురాణాలలో ఇటువంటి సంఘటనలు విస్తారముగా అధిక సంఖ్యలో వర్ణింపబడివున్నాయి. హనుమంతుడు సుగ్రీవుని దగ్గర వుండే ఒక సాధారణమైనటువంటి ఉద్యోగి. సీతను తిరిగి తెచ్చుటకు సముద్రమును ఎలా దాటాలి అనే సమస్య ఆయనకు ఎదురైనది. ఆయన తన పరిమితశక్తిని చూచి అలా చేయటానికి తాను అసమర్థుడనని భావించాడు. కానీ జాంబవంతుడు ఎప్పుడైతే ఆయనను ప్రోత్సహించి, నిద్రాణమైయున్న శక్తులు జాగృతమైతే ఆయన ఏమైనా

సాధించగలడు అని గుర్తుచేసిన తరువాతనే హనుమంతుడు అసంభవాన్ని సంభవము చేసి చూపించాడు.

భారతదేశము యొక్క ఆధ్యాత్మ 'తత్త్వజ్ఞానము' మరియు 'యోగసాధన' విజ్ఞానము విశ్వవిఖ్యాతమైనది. అది మానవునిలో దైవత్వమును ఉదయింపచేయుటలో సర్వథా సమర్థమైనదని అంగీకరింపబడినది. ఇలాంటివి లెక్కలేనన్ని ప్రమాణాలు, ఉదాహరణలు కలవు. శాపాలు, వరదానాలు ఇచ్చేటటువంటి శక్తి మరియు ఋద్ధి, సిద్ధులను పరిచయము చేసే ప్రసంగాలతో, లెక్కలేనన్ని ఉదాహరణలు చరిత్రలో ప్రసిద్ధికెక్కాయి. గడచిన శతాబ్దములలో భౌతిక విజ్ఞాన ఆవిష్కారములు ప్రపంచమునకు చమత్కారములను చూపించి, ఆశ్చర్యచకితులను చేశాయి. భారతదేశము అనాదికాలము నుండి తన విశిష్టతను వికసింపచేసుకుంటూనే వున్నది. వాటి ఆధారముగానే ఋషులు, మునులు, మరియు మహామానవుల యొక్క ఇంత పెద్ద పరివారము వృద్ధి చెందింది. వారు కేవలము తమ దేశాన్నే కాక తమ సంపర్కములోకి వచ్చిన సువిస్తృతమైన పరివారాన్ని కూడా ఎంత సమున్నతము చేశారంటే దాని ఆధారంగానే భూమిపై స్వర్గావతరణ సంభవము అనిపిస్తుంది.

మనస్వియైన 'కౌండీయ' మధ్యపూర్వ విస్తృత క్షేత్రములో ఎటువంటి ప్రచనముల ప్రవాహమును ఉత్పన్నము చేశాడంటే, అది ఈ విశాలమైన క్షేత్రమును అన్నివిధాలా సమున్నతచేసి భారతదేశ సాంస్కృతిక ఉపనివేశముగా మారింది. కుమారజీవుని కథలు-గాథలు ప్రతి ఒక్కరికీ ఈనాటికీ కూడా దీపస్థంభాల వలె పనిచేయుచున్నవి. అతడు బీహార్ ప్రాంతములోని ఒక పేద కుటుంబములో జన్మించి కాలినడకన కాశ్మీరు ఉత్తరపు అంచున వున్న తక్షశిల విశ్వవిద్యాలయములో చదివాడు. ఈ మధ్యలో అతని దృష్టి విశాలమైన



చైనాక్షేత్రము మీద పడి, దానిని హిందూధర్మము యొక్క బౌద్ధశాఖ అనుయాయిగా మార్చాలని నిర్ణయించుకున్నాడు. సాధనాలలో లోటు వున్నప్పటికీ అతడు గోభీ ప్రాంతపు బురదమయ పీఠభూమిని, ఖేతాన్ యొక్క సువిస్తృత ఎడారులను అధిగమించి ప్రాణాలను పణంగా పెట్టి చైనా చేరాడు. అక్కడ అపరిచిత భాష, సంస్కృతిల సమస్యను దాటి చైనాలో ఎంత మూర్ధన్య ధర్మప్రచారకుడైనాడంటే చైనాలోమాత్రమే కాక, సమీపములో వున్న సైబీరియా, కొరియా, జపాన్ మొదలైన దేశాలలోకూడా ఈ సంస్కృతిని అవలంబింపచేయుటలో విజయాన్ని సాధించాడు. ప్రతిభావంతులైనవారు చేసే ప్రతి మంచి పనికీ, చెడ్డపనికీ కూడా సహాయము చేసేవారు - అనుయాయులు లభిస్తారు. కానీ ఎవరైతే తుఫాను వలె లేచి తనతోపాటే చెత్తాచెదారాన్ని కూడా ఆకాశము వరకు వ్యాపించేస్తారో అటువంటివారికే ప్రతిభావంతులకే కీర్తి లభిస్తుంది.

నెపోలియన్ 'అసంభవం' అనే శబ్దము మూర్ఖుల నిఘంటువులోనే వుంటుంది' అనే వాడు. ఆల్ప్సు పర్వతాల వంటి దుర్గమమైన అవరోధాలన్నీ దాటేందుకు ప్రయత్నము చేసినప్పుడు. దాన్ని ఎవరూ ఇంతవరకూ దాటలేకపోయారు, అనేక మహత్త్వాకాంక్షులందరూ ఆ అవరోధములలో చిక్కుకొని పరిష్కరించలేక చేతులెత్తేశారు, మరి రెండవఅంచుకు చేరుట అతనికి మాత్రము ఎలా సంభవమౌతుంది అన్నారు. ఆయన సంకల్పమే ఆయనకు ఎంతటి ధైర్యాన్నిచ్చిదంటే ఆల్ప్సు పర్వతాలే నెపోలియన్ కొరకు త్రోవ నివ్వాల్సివచ్చింది. చివరికి అదే జరిగింది.

చాణక్యుడు ఒక సాధారణ బ్రాహ్మణుడు మాత్రమే, కానీ అతను తన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవడానికి నందవంశ నిర్మూలనకు యుద్ధము చేశాడు. అది పూర్తిఅయినా కూడా ఆయన విశ్రాంతిగా

కూర్చోలేదు. భారతదేశం మీదకు తరచు ఆక్రమణలు ఎక్కడనుండి మాటిమాటికీ చివురించి తమ చమత్కారాలను చూపిస్తాయో వాటిని అక్కడనుండే పెకిలి వెయ్యాలి అని నిశ్చయించుకున్నాడు. ఆయన తన దివ్యదృష్టితో చంద్రగుప్తుని ఎన్నుకొని అతనిని నిరంతరముగా యుద్ధమందు నిమగ్నవై ఆక్రమణదారుల హింసావాదాన్ని కూకటివ్రేళ్ళతో పీకిపారవేసే విధముగా తయారుచేశాడు. చంద్రగుప్తుడు సందేహిస్తూ ఈ ప్రయత్నములో ఎదురయ్యే అసంఖ్యాకమైన కష్టాల గురించి విస్తారముగా విశ్లేషించాడు . విన్న తరువాత చాణక్యుడు వ్యంగ్యముగా కనులు ఎఱ్ఱ చేసి 'నువ్వు దాసీపుత్రుడవు. నీ సహజమైన పిఱికితనం, జడత్వమును వ్యక్తీకరిస్తున్నావు. నీవు ముందు ఒక విషయము అర్ధము చేసుకోవాలి. నేను చాణక్యుడను, చాణక్యుడు ఏది ఆలోచిస్తాడో అది క్రియాన్వితమగుటయే కాక అది ఫలించి తీరుతుంది. నువ్వు వ్యర్థముగా మాట్లాడటము మానెయ్యి. ఏది చెప్తున్నానో దానిని నిమిత్తమాత్రుడవై చేస్తూ పో! ఒకటి గుర్తుంచుకో, చాణక్యుడు వ్యర్థమైన ప్రణాళికలు ఏనాటికీ వేయడు మరియు అతనికి అపజయము అనే సందేహము కూడా రాదు'. చంద్రగుప్తుడు అవనతశిరస్కుడయ్యాడు. అయన అనుశాసనమును అక్షరాలా పాటించాడు. అతని ముందు వారు దేనిని అసంభవము అని భావించి నిశ్శబ్దంగా కూర్చున్నారో మరియు మనస్సులో కుమిలిపోయారో అది చేసి చూపించాడు.

భారతదేశము యొక్క అతి పురాతనమైన విజ్ఞానము 'చేతనావిజ్ఞానము'. దీనినే యోగసాధన, తపశ్చర్య అనే పేర్లతో చెప్తాము. దాని ఫలితముగా లభించే బుద్ధి, సిద్ధులతో పురాణగాధల పుటలన్నీ నింపబడివున్నాయి. అసలు యోగాభ్యాసమంటే ఏమిటి? దీని యొక్క లోతుకు దిగేవాళ్ళు తెలుసుకొనేదేమంటే ఇది తితీక్షతో కలిసివున్న



కర్మకాండల యొక్క ప్రత్యక్షఫలితము అని అనిపించినా వాస్తవానికి ఇది మనోబలమును ఉద్భవింపజేసే, నిద్రాణమైవున్న ప్రాణాగ్నిని ప్రజ్వలింపచేసే ఒక ప్రక్రియ మాత్రమే. దైవీశక్తుల యొక్క కేంద్రబిందువు అదే. చెట్టు మీద వుండే పండ్లు, పూలు ఆకాశమునుండి క్రిందపడిఅతుక్కుంటాయి అని ఆలోచించేవాళ్ళు తప్పుగా అర్థము చేసుకుంటున్నారు. భూమినుండి వ్రేళ్ళద్వారా పీల్చబడిన రసముతో చెట్టు మొదలు బలంగా వుంటుంది. చిగుళ్ళతో, పచ్చదనముతో చెట్టును విశాలంగా నీడను ఇచ్చేవిధముగా పెంచి దాన్ని పూలతో, పండ్లతో కప్పివేస్తుంది. ఆ శక్తి ఆధారముగానే అవి భయంకరమైన తుఫానులతో పోరాడుతూ తమ స్థానములో కదలకుండా చిరకాలము వరకు నిలిచివుంటాయి. సిద్ధపురుషులు కోరుకున్న ప్రగతి యొక్క వున్నత శిఖరానికి చేరుతారు. మహాపురుషుల సాఫల్యములు ఇతరులకు ప్రేరణ ఇస్తూ విజయశ్రీని వరించగలిగే శిక్షణకు ప్రత్యక్షప్రమాణముగా నిలబడతాయి. దానితో వుత్సాహితులై ఒక్కోసారి సగం చచ్చిన లేక సగం మూర్ఛితస్థితిలో వున్నవారుకూడా దేవమానవుల వంటి పురుషార్థాన్ని చేసి చూపించడము మొదలెడతారు.

శరీరమే ఈనాడు ఆరాధ్యదేవత అయివున్నది. దానిని బలంగా, దృఢంగా చేయుటలో మనిషి యొక్క మూడింట నాలుగు వంతుల శక్తి వినియోగించబడుతున్నది. ఇంతేకాక అలంకరణ సామగ్రి, బహుమూల్యమైన ఆహారము, ఓషధులు సేవించగలిగినా పేదవారితో పోలిస్తే ధనవంతులు ఎక్కువ బలహీనులుగా, రోగగ్రస్తులై అల్పజీవులుగా వున్నారు. చికిత్సావృత్తిలో వున్నవారుకూడా తమ పరివారంతోసహా స్వయంగా రోగముల బారినపడివుండటంవలన ప్రత్యక్షముగా కాకపోయినా మనసులోనే విలువలేని ఆహారవిజ్ఞానమును పనిచేయని ఔషధములను తిట్టుకుంటు

వుంటారు.

మనోబలము సర్వదా ఇందుకు భిన్నమైన మార్గములను చూపిస్తూవుంటుంది. ఆఫ్రికాకు చెందిన మసాఈ తెగవారు బల్లెములతో మాత్రమే పెద్దసింహాలతో తలపడి వాటిని చంపి తమ పెళ్ళిళ్ళకు నిశ్చితార్థము కొరకు విధించబడె ఈ షరతును తరతరాలుగా పూర్తి చేస్తూ వుంటారు. విశ్వవిఖ్యాతి చెందిన సెండో అనే మల్లయోధుడు యౌవనపు మొదటిదశలోనే ఎముకల గూడులాగా వ్యాధిగ్రస్తుడై ఉన్నాడు. కానీ ఎప్పుడైతే తన మార్గదర్శుని వలన జీవితములో నూతన విద్యను గ్రహించాడో అప్పుడు అతడు రోజురోజుకి ఆరోగ్యంగా, బలంగా మారడము మొదలెట్టి తరువాత ప్రపంచమే గౌరవించదగిన వస్తాదుగా మారాడు. భారతదేశము యొక్క 'హింద్‌కేసరి' అనే బిరుదు పొందిన చందగీ రామ్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగము చేస్తున్నప్పుడు క్షయరోగి. అతనిని తాకడానికి కూడా భయపడి ప్రతివారూ దూరంగా వుండేవారు. ఎప్పుడైతే అతను సాహసముతో తన మానసిక కాయకల్పమును చేసుకున్నాడో, అలవాట్లను పూర్తిగా మార్చేసుకున్నాడో ప్రకృతి తల్లి అతడిమీద అనేక వరదానాలు కురిపించింది. హిందూదేశమంతటా గౌరవించబడిన వస్తాదుగా అతని పేరు మారు మోగింది.

పూర్వకాలములో విచిత్రంగా వుండే ఇలాంటి కథలు చాలా ఉన్నాయి. మట్టిని కుప్పగా వేసుకొని ఏదోవిధముగా శ్వాసలను లెక్కించే చ్యవన ఋషి తన దృష్టికోణాన్ని మార్చుకొని తన పురుషార్థాన్ని మరోదిశకు మళ్ళించుకొనినప్పుడు అశ్వనీకుమారులను వైద్యులు తమ మందుల పెట్టెలను తీసుకుని పరిగెత్తుకుంటూ వచ్చి ఆ వృద్ధుని నవయువకునిగా మార్చివేశారు. ఎవరి ప్రాణము పోతే తమకు రుచిగల భోజనము లభిస్తుందనే ఆశతో నక్కలు ఎదురుచూస్తున్నాయో అటువంటి వ్యక్తికి సేవ-సహాయములు చేయుటకు సుకన్యవంటి



అనింద్యురాలైన సుందరరాజకుమారి ప్రాణాలను పణంగా పెట్టింది. యయాతిని వృద్ధాప్యము నుండి యువకునిగా మార్చే కథ ప్రసిద్ధిచెందింది. హనుమంతుడు బాల్యమునుండే పవనపుత్రుడు, ప్రాణపుంజము అని పిలువబడేవాడు. అతడు కొండమీద నుండి పడటము వలన విశాలమైన శిల పొడిపొడి అయిపోయింది. యుగాల తరబడి తపస్సు చేసి క్షీణించిన శరీరము గల పార్వతి, శివుడు ఆమెను వరించిన తక్షణమే త్రైలోక్యమోహినిగా మారిపోయింది. అర్జునుని బాణాలతో పాతాళము నుండి జలధార ఉప్పొంగి మరణాసన్నుడైన భీష్మపితామహునికి స్వచ్ఛమైన నీటిని త్రాగించింది. ఒక తీతువుపిట్ట సముద్రమును ఎండబెట్టి తన గ్రుడ్లను తిరిగి తీసుకునే సంకల్పము అగస్త్యుని మాధ్యమముగా జరిగినా మధ్యలో వదల లేదుకదా!.

జమదగ్ని యొక్క పుత్రుడైన పరశురాముడు తన తండ్రికి జరిగిన అత్యాచారానికి బదులు తీర్చుకోవడానికి సిద్ధపడినపుడు అతడు మహాబలి సహస్రబాహువుయొక్క వేల భుజాలను అతి సులువుగా ముక్కలుముక్కలుగా నరికి అతని సహయోగులందరినీ కూడా చంపివేశాడు. నా వల్ల కాదని మొండికేసిన అర్జునుని మహాభారత విజేతగా తయారుచేసిన కీర్తి కృష్ణుని ప్రోత్సాహపూరితమైన ప్రబోధమునకు లభిస్తుంది.

ఈనాడు మనిషికి వైభవము, ఆరోగ్యము, కీర్తి తప్ప ఇక ఏ కోరికా కనిపించడము లేదు. దానికొరకు ఏది ఉచితమో ఏది అనుచితమో తెలుసుకోకుండా సగటుమనిషి రాత్రి పగలు పనిచేస్తున్నాడు. ఏదైనా కొంచెం లభించినా కుమార్గముయొక్క దారుల వల్ల అవి నిలవడం లేదు. ఈనాటి భయంకరమైన అవాంఛనీయ పరిస్థితులలో ప్రతివొక్కరు అగణిత వైభవముల ఉద్గమస్థానమైన ఆ ప్రాణాగ్నికేంద్రమును పెంపొందింప జేయట మనయొక్క తీవ్రపురుషార్థమేకాక , ఈశ్వరుని

ఎకైక అనుగ్రహమని తెలుసుకుని ఇతరులకు తెలియచేయాలి. నేటి ఆవశ్యకత ఏమిటి అంటే వైభవము స్థిరంగా వుండాలి మరియు రోజురోజుకి పెరుగుతూ చివరకు అది శ్రేష్ఠమైన వాటికి సదుపయోగపడి చిన్న బీజము నుండి అత్యంత విశాలమైన వటవృక్షరూపముగా మార్పుచెందాలి.

సుదాముడు, నరశీమెహతా, సుగ్రీవుడు, విభీషణుడు, దైవీ అనుగ్రహముద్వారా ఎంత వైభవము పొందారంటే దానివలన చరిత్రలో ప్రసిద్ధి పొందారు. మానవవంశమునకు కాక దేవతావంశజులైన పాండవులు మంచి పరాక్రమవంతులుగా గుర్తింపబడ్డారు. ధృవుడు, ప్రహ్లాదుడు పొందిన అత్యున్న స్థానము ఎంతో దుర్లభమైనది. అది ఎవరికీ లభించేది కాదు. సప్తఋషులు అమరులైనారు. నారదునికి తన ఇచ్ఛానుసారము భగవానుని లోకములలో తిరగగల స్వాతంత్ర్యము లభించింది.

వైభవము ఎవరిది? పరాక్రమము ఎవరిది? విభూతులు ఎవరివి? వీటన్నింటికీ సమాధానముగా భగవంతుని పేరునే తలచుకోవాలి, కానీ భగవానునికి అతి దగ్గరైన, సునిశ్చిత స్థానము ఒక్కటే- అంతరంగములో విద్యమానమైన ప్రాణాగ్ని. దానిని తెలుసుకుని వృద్ధిపరచుకొనుటవల్ల వేటిని ధారణ చేయుటకు అవసరమైన పాత్రత మానవుడు కలిగివున్నాడో అవన్నీ లభిస్తాయి. మేఘములద్వారా వర్షించే అజస్రధారను ఏకత్రితము చేసుకొనుటకు సముచితమైన లోతు, సామర్థ్యము కలిగిన జలాశయములే సమర్థమైవుంటాయి. ఋద్ధి-సిద్ధులను సంపాదించాలనే కోరికగాని, ముక్తి పొందాలనే కోరికగాని దేనినైనా ప్రాప్తింపజేసుకొనుటకు దైవీశక్తులు ప్రత్యక్ష ప్రాతినిధ్యము వహించే ఆ ప్రాణాగ్నిని ప్రజ్జ్వరిల్లింపజేసుకొనుట అనివార్యము.



## 3. ఆత్మబలమే సర్వోపరి

భారతదేశము ఈ సమస్త భూమండలములో ప్రతిచోట తనదైన ప్రత్యేకమైన ప్రతిష్ఠను పొందుతూనే వుంది. ఈ దేశపు గొప్పతనము సమృద్ధి, ఉదారత, అనేకత్వము ప్రతివారికి ఆశ్చర్యమును కలిగించే విషయము. ప్రపంచము దీని పట్ల భావపూర్వకమైన శ్రద్ధాంజలిని అనేక విధాలుగా అందించింది. జ్ఞానము మరియు మార్గదర్శనము యొక్క వెలుగు నివ్వగల విశేషమైన ప్రతిభ వల్ల ఈ దేశము జగద్గురువు అని పిలువబడినది. సువ్యవస్థితమైన పరిపాలనా విధానము, ప్రగతిపథమునందు ముందుకు నడిపించగల సరంజామాను పోగుచేసుకున్న కారణముగా దీని నాయకత్వానికి చక్రవర్తి అనే పేరు ఇవ్వబడినది. ఎవరైతే దరిద్రులను, ధనవంతులుగా మార్చగలరో వారి గొప్పతనమును ఎవరు సందేహించగలరు? ఈ కారణముగానే దీనిని బంగారు పిచ్చుకనీ, రత్నగర్భ అనే పేర్లతో గుర్తించారు. ఇక్కడివారు సాధారణ నాగరికుల వలె జీవనయాపన చేస్తున్నప్పటికి స్వరసంపదలకు అధిపతి అయిన భారతవర్షములో, సాధనాలను చక్కగా సదుయోగపరచుట వలన వచ్చిన సంపదలు, సుసంపన్నతనేది వ్యావహారికముగా చెప్పబడుతున్నది.

భారతదేశము యొక్క సంస్కృతి, ఆచారవ్యవహారాలు ఎంత ఉత్కృష్టమైనవి బలమైనవంటే నరవానరులవలె జీవించే సామాన్యమానవులు ఊహించలేని వ్యక్తిగత ప్రతిభలకు సానపెట్టి ఇతరులకంటే ఎన్నో రెట్లు అధికసామర్థ్యము కలవారుగా మారవచ్చు. విషయము అర్థము కానందువలన ఇతరులు వీరు అసామాన్య

వర్గమునకు చెందినవారు అని భావించి తృప్తి పడతారు. వీరిలో చమత్కారము చూపించే దేవత ఆవేశించింది అలాగ మనలాంటి వారిలో జరగదు అనుకుంటారు. ఈ మాన్యత ప్రపంచజనాభాకంతటికీ భారతభూమిలో నివసించేవారు దేవమానవులనే భావనను నింపింది. ఈ ధారణలో రెండవచరణము ఎచ్చట దేవతలు నివసిస్తే అది స్వర్గము అవుతుంది. ఇది కూడా ఈ దేశము సాధించినది. కారణము ఏమంటే దేవమానవులు సౌజన్యము, సహయోగము, సేవాసాధనలలో నిరతులై వుండుట వలన వ్యక్తిగత సంబంధబాంధవ్యాలు, నాగరిక ప్రచలనలు మరియు స్నేహ-సౌహార్దాల ఆధారముగా పొంగిపొరలే ఆనందాలు, ఉల్లాసాలకు ఇచ్చట లోటులేదు. అందుచేత భారతభూమి మీద స్వర్గావతరణ జరిగింది మరియు ఈ భూమి 'స్వర్గాదపి గరీయసీ' యని సహజంగానే ఒప్పుకుని తీరాలి. భగవానుని అవతరాలు ఎన్నో వున్నాయి. అవి పది లేదా 24 కావచ్చును. ఆ జన్మలన్నీ ఈ భూమిమీదే జరిగినవి. ఆకాశములో ఎగురుతున్న మరియు అదృశ్యముగా వున్న అజర-అమర దేవతలను పట్టుకొనుట కష్టము కాని ఋషులు, మునులు, మరియు మనీషుల యొక్క ప్రజ్ఞ, మరియు ఆశ్చర్యమును కలిగించే పురుషార్థపరాయణత, కర్తవ్యనిష్ఠ తత్పరతలను చూస్తూ వుంటే నిస్సందేహముగా దేవతలు భారత భూమిమీద తిరుగుతున్నారని అనిపిస్తుంది. వారు తెలియని లోకాలలో నిలిచివున్న స్వర్గాన్ని భూమిమీదకు దింపి సరిగా దానికి అనుకరణ గా తయారుచేశారు అని అనిపిస్తుంది.

ప్రపంచమందలి మానవసముదాయమంతా భారతీయ దేవమానవులు ఏదైనా చేయుటలో సమర్థులని తెల్సుకున్నారు. మరియు వారి నేతృత్వములో పూర్తి లాభాన్ని పొందారు. యుగనిర్మాణ



యోజన ద్వారా ప్రచురించబడిన "సమస్త ప్రపంచానికి భారతదేశము యొక్క అజస్ర అనుదానము' అనే గ్రంథ మందు లెక్కలేనన్ని ప్రమాణాలు చారిత్రక సాక్ష్యాలతో సహా ఈ విషయాన్ని నిరూపించింది. ఈ దేశమునందు నివసించేవారు తమ నివాసక్షేత్రము వరకు మాత్రమే తమ మహత్వపూర్ణమైన విధివిధానాలను పరిమితము చేయకుండా భూమండలములోని ఖండఖండాంతరాలలో, క్షేత్రాలలో , దేశాలలో అతి కష్టసాధ్యమైన యాత్రలు చేసి వెనుకబడినతనము అనేది ఏ ప్రాంతము లోనూ వేళ్ళు పాతుకోకుండా వుండే ప్రయత్నాలు చేశారు. సూర్యుడు ఉదయించే సమయాన అంధకారముయొక్క శక్తి అనాయాసముగా ఎలా తొలగిపోతుందో అదేవిధముగా అవసరమైన ఉత్సాహాన్ని, పురుషార్థాన్ని వారిలో నింపి వెనుకబడినతన్నాని తోసి పారేశారు. ఈ విషయంగా విస్తృతమైన వివరణ కావాలి అనుకునేవారు పైనచెప్పబడిన పుస్తకములో ఇవ్వబడిన ప్రవాసశృంఖలాలను శ్రద్ధగా చదివితే చాలు. ఇదే మన భారతీయ సంస్కృతి యొక్క పరంపర. దీనిని అలవరచుకున్నవారు స్వయముగా తమను తాము శీలము కలవారిగా, ఆదర్శవంతమైన పురుషార్థము కొరకు సమర్పించుకుంటారు. కేవలము తమను తాము చక్కగా తీర్చిదిద్దుకుని మంచి సంస్కారమును అలవరచుకొనుటయే కాక తమ సంపర్క క్షేత్రమును, క్రియా క్షేత్రమును కూడా సునియోజితము చెయాలి. అలా ఏ కొంచెము లభించినా దానిని చక్కగా సదుపయోగపరిచినట్లయితే ఎన్నో రెట్లు లాభాన్ని పొందగలరు.

కొలంబసు ఈ యశోగాథలను తన దేశమైన స్పెయిన్‌లో ప్రజలద్వారా విన్నాడు. అతడు ఈ బంగారుగని నుండి కొంత పొందాలని ఆతురతతో, వ్యాకులతతో ఓడ ద్వారా వెదకడము మొదలుపెట్టాడు.

సరియగు దిశానిర్దేశము లేనందువలన అతడు భారతదేశము చేరక అమెరికా తీరాన్ని చేరాడు. అదే భారతదేశమని భావించాడు. అక్కడి వారి ఎఱ్ఱతోలు చూచి వారికి 'రెడ్ఇండియన్స్' అని పేరు పెట్టాడు. ఈ సంఘటన ద్వారా, మన దేశము సాధించిన అభివృద్ధి ప్రగతి ప్రపంచముమంతా ఏ దృష్టితో చూస్తున్నదో తెలుస్తోంది.

ఇతర యాత్రికులుకూడా ఈవిధముగా వెతుకుతూ సుదీర్ఘ ప్రయాణము అతి కష్టము మీద చేస్తూ ఇచ్చటకు వచ్చి తాను చూచిన దృశ్యాలను కళ్ళకు కట్టినట్లుగా వర్ణిస్తూ విస్తృతమైన గ్రంథాలను రచించారు. ఇలాంటి యాత్రికులలో ఫాహియన్, హ్యూయన్‌సాంగ్, మెక్‌బన్నర్, మార్కోపోలో మొదలైనవారు ప్రసిద్ధులు. మహాప్రభువుగా చెప్పబడిన క్రీస్తు కూడా చాలా కాలము ఈ దేశమందే గడిపాడు మరియు ఏ వెలుగును (జ్ఞానాన్ని) పొందాడో దానిని తనదైన భాషలో, పద్ధతిలో చెప్పి వ్యాప్తి చేశాడు. క్రైస్తవధర్మ పర్యవేక్షకులు బౌద్ధధర్మమును అనుకృతిరూపంలో అంగీకరించారు అని చెప్పవచ్చు.

ఈవిధానమే చాలా కాలము నుండి జరుగుచున్నది. పాల్‌బ్రంటన్ భారతదేశమందలి చమత్కారాలను పరిశోధించుటకే వచ్చాడు.ఆయన తన అనుభవాల ఆధారముగా ఆశ్చర్యమును కలిగించే సాహిత్యాన్ని ప్రచురించాడు. ఫ్రాంన్స్ దేశపు వనిత శ్రీమాత ఇదే ఉద్దేశ్యముతో భారతదేశానికి వచ్చి అరవిందుల ఆశ్రమంతో విడదీయలేని సభ్యురాలిగా మారి ఇచ్చటనే వుండిపోయింది. అనీబిసెంటు, గాంధీగారి ఆశ్రమములోని మిస్‌స్లేడ్ మరియు బ్రిటనులో జన్మించిన పర్యావరణ విశేషజ్ఞురాలు సరళాబెన్ జీవితమంతా ఇచ్చటనే గడిపారు. వివేకానందునికి సహాయకురాలిగా ఇచ్చటనే నివసించిన సోదరి నివేదిత పేరు ప్రతివారరూ వినే వుంటారు. ఫాదర్ సి.ఎఫ్. ఎన్‌డ్రజ్జా



భారతీయులకు మరియు ప్రవాసభారతీయులకు చేసిన సేవలు ఎవరూ మరువజాలరు. ఈ దేశజనాభాను పర్యవేక్షణ చేస్తే మనకు తెలిసేది పారసీలు, ముస్లిములు, క్రిష్టియన్లు ఇతర ధర్మాలను ఆచరించేవారంతా ఏదో ఉత్సాహముతో ఇక్కడికి వచ్చి ఇక్కడి వాతావరణము చూసి ఇక్కడే స్థిరముగా నివాసము ఏర్పరుచుకుని వుండిపోయారు. కల్పవృక్షపు నీడలో కూర్చున్నవారికి తరువాత అక్కడనుండి లేచి వెళ్ళాలన్న భావన ఎవరికి వస్తుంది, ఎందుకు వస్తుంది?

ఈ సందర్భములో ఆశ్చర్యచకితులయ్యేవారు ఇక్కడ విశేష రూపములో అలవరచుకొనబడే యోగవిద్యకు ప్రాముఖ్యతనిచ్చారు, మరియు దాన్నే చమత్కారాలకు జన్మనిచ్చే తల్లిగా తెలిపారు. ఈ విషయము నిజమే కూడా, కానీ భ్రాంతులు, అతిశయోక్తులు, స్వార్థపరుల జంఝాటంలో చిక్కి దాని స్వరూపం ఎంత విచిత్రంగా మారిందంటే దాన్ని గారడీ, మాయలు చేసేవారి విద్యగా, ఇంద్రజాలములు చూపించె మోసపూరితమైన విద్యగా దిగజార్చారు. కానీ వాస్తవానికి విషయము అది కాదు. యోగము ఒక ఉన్నత స్థాయికి చెందిన విజ్ఞానసమ్మతమైన విద్య. ఇది రెండు సత్యాల మీద ఆధారపడి వున్నది. ఒకటి తపశ్చర్య. వ్యావహారిక భాషలో దీనిని సంయమనము అలవరచుకొనుట, క్రమశిక్షణతో వుండుట, లక్ష్యప్రాప్తి కొరకు తితీక్షా వ్రతముల వంటి కష్టముతో కూడిన పరిస్థితులను ఎదుర్కొనుటకు తననుతాను మలచుకొనుట మొదలైనివిగా అంటారు. ఈ ఉద్దేశ్యము సాధించుటకోరకే అనేక కర్మకాండలు, వ్రతాలు, ఉపవాసాలు, పాదయాత్రలు మొదలైన విధివిధానాలున్నాయి. ఇవి సాధనాలే కాని సాధ్యములు కాదు. సాధ్యం కావాలంటే వ్యక్తిత్వములో ప్రామాణికత,

ప్రఖరత, వినమ్రత, మంచి నడవడి ఇవన్నీ కావాలి. ఆకర్షణలకు, వత్తిడులకు చలించరాదు. అనుకున్న దాని మీద నిలబడాలి. అవినీతిపరులతో పూర్తిగా వ్యతిరేకించాలి. దానివల్ల ఆతంకవాదుల రోషాన్ని, దాడులను, ఆక్రమణలను, తగాదాలను సహించాల్సి వచ్చినా సరే. ఇటువంటి మనఃస్థితిని పరిపక్వము చేయడానికి తపశ్చర్య పేరుతో చెప్పబడే అనేక కర్మకాండలను పరిగణన లోకి తీసుకోవలసి వుంటుంది. కాని ఆశ్చర్యము ఏమిటంటే, ప్రజలు లక్ష్యాన్ని మర్చిపోయి కర్మకాండలు పూర్తి చేయడము లోనే నిమగ్నమవుతారు. ఈ క్రియా కలాపాలు మాత్రమే చేయడము వలన సిద్ధపురుషులు కాగలరని భావిస్తారు.

తపశ్చర్య యొక్క రెండవ పక్షము యోగసాధన. తపశ్చర్యలు శరీరప్రధానంగా వుంటాయి మరియు యోగము మనస్సును అవాంఛనీయతల నుండి ముక్తి నిచ్చి ఆత్మవిస్తారము యొక్క పరిధిలో ప్రవేశించమని చెప్తుంది. దీనిని ఇంకా అధికంగా, స్పష్టంగా, తేలికగా అర్థము చేసుకోవాలంటే తను పనిచేసే ప్రదేశము, స్వభావము, అభ్యాసము, దృష్టికోణము మరియు క్రియాకలాపాలు ఎలా తయారుకావాలి అంటే అందులో సునియోజిత వ్యవస్థ తప్ప మరేమీ కనపడరాదు. మనీషులు ఇదే ఆలోచించాలి, ఇదే చేస్తూ వుండాలి. వారు అవ్యవస్థ వలన ఉద్భవించిన దుష్ప్రవృత్తులను కమ్మరివాని వలె సమ్మెటదెబ్బలుకొట్టి సరిచేస్తూ మరియు పనికిరాని ధాతువుల ముక్కలను కరిగించి మూసలో పోసి అత్యంత మహత్వపూర్ణమైన రూపమును ప్రసాదిస్తారు. దీని కొరకు ప్రాణాయామము, జపము, ప్రత్యాహారము, ధారణ, ధ్యాన, సమాధులనే కాక ఇంకా అనేక విధాలైన మార్గాలను స్వంతం



చేసుకోవాలి. జ్ఞానయోగము, భక్తియోగము, కర్మయోగముల విధానము కూడా ఈ నిమిత్తముగానే నిర్మించబడినవి. అనుష్ఠానములు, పురశ్చరణలు, వ్రతధారణల నిర్ధారణ కూడా దీని కొరకే ఏర్పడినవి. ఇదంతా చేసినా కూడా ఈ చిత్రవిచిత్రమైన కర్మకాండ వెనకాల దాగివున్న అంత:కరణ యొక్క విస్తృతీకరణ ధ్యానమందు లేనిచో ఇదంతా చిన్న పిల్లల ఆటవలె వుంటుందే కానీ అంతకు మించి ఏమీ జరగదు. దాని వలన ఎలాంటి ప్రతిఫలము లభ్యము కాదు, ఏవిధమైన యోగపరమైన దివ్యశక్తులు గోచరింపవు. ఈవిధమైన భ్రమలలో పడితిరిగేవారు ఈ ప్రపంచమందు తక్కువగాలేరు. తమ కాలాన్ని వృధా చేస్తూ దెబ్బలు తింటూ, నిరాశమినహా వారికేమీ లభించదు. ప్రజల ముందు తమను గురించి తలాతోకాలేని గొప్పలు చెప్పుకున్నా ఏమిలాభము?.

ఏ యోగవిద్యకారణముగా భారతదేశము ఒకనాడు స్వర్గముతో సమానముగా ప్రఖ్యాతి చెందినదో అది నిజానికి వ్యక్తిత్వములో ఉన్నా ప్రత్యక్ష, అప్రత్యక్ష సామర్థ్యములను వికసింపజేసి మానవశరీరమందలి కణకణము ప్రతిభతో సుసంపన్నముచేసి శరీరమును ఓజస్సుతో, మనస్సును తేజస్సుతో, అంత:కరణను బ్రహ్మవర్చస్సుతో నింపి తన యదార్థత ప్రత్యక్ష ప్రమాణమును నగదు ధర్మముగా సాధకునకు అందింస్తుంది. చెప్పేది ఏమిటంటే యోగసాధనకు సాధారణజీవన విధానాన్ని విడిచి చిత్రవిచిత్ర వేషధారణ అవసరము లేదు.

ఇంగ్లాండు ప్రభుత్వ ఆదేశానుసారము వైస్రాయి గాంధీగారిని మాటలకు ఆహ్వానించాడు. ఇండియాకు పంపే ముందు గాంధీగారి కళ్ళలో కళ్ళు పెట్టి చూడరాదని వైస్రాయికి స్పష్టముగా చెప్పిన విషయమును ఆయిన మరిచిపోలేదు. గాంధీగారు గారడి చేసి తన

వైపుకు త్రిప్పుకొని వశపరచుకుంటారని వారి అభిప్రాయము. ఇది సర్వదా అబద్ధము కాదు. సహాయనిరాకరణ ఆందోళన సమయాన ఇంగ్లాండు ప్రభుత్వము గాంధీగారి మీద అధిక వత్తిడిని తీసుకురావద్దని చెప్పి పంపారు. ఈ 92 పౌండ్ల బాంబు పేలిందంటే బ్రిటీష్ శాసనము జాడలేకుండా పోతుందని వారి భావము. రౌండు టేబులు కాన్ఫరెన్స్‌కు గాంధీగారు ఇంగ్లాడుకు వెళ్ళారు అనేకమంది గొప్ప అధికారులు సమావేశములో పాల్గొన్నారు, కాని ప్రభుత్వ వరిష్ట అధికారుల కళ్ళు గాంధీగారి మీదనే నిలచినవి. అసలు ఈయన ఏమి చెప్పనున్నాడు అని అందరి వుత్సుకత. వారి ఒక్కొక్కొ మాటను విన్నాక ఫలితము ఏమిటంటే గాంధీగారు పూర్తిగా జయించి భారతదేశానికి తిరిగివచ్చారు.

యోగుల సమూహములో ఒక పేరు వినోబాగారిది కూడా వుంది. వారు ఆరామ్-హరామ్(విశ్రాంతిని విడిచిపెట్టండి) మంత్రాన్ని తన జీవితచర్యలో ప్రతిక్షణం నింపుకున్నారు. వారు పెద్దపెద్ద ప్రణాళికలు వేశారు. అవి తాము కోరుకున్న విధముగానే సిద్ధింపచేసి చూపించారు.

గొప్పగొప్ప ఉద్యమాలకు జన్మనిచ్చిన వారు ఏ విధముగా కోట్లాదిమందిని ప్రభావితము చేస్తారో ఈ దశాబ్దముల చరిత్ర పుటల మీద దృష్టి నిలిపితే ఉదాహరణలు కుప్పలు తిప్పలుగా మనముందుంటాయి. లెనిన్ ప్రారంభజీవితాన్ని చూచిన వారెవరూ ఆ వ్యక్తి ఇంత ఆశ్చర్యకరముగా తన దేశాన్ని చెడుపాలన నుండి విడిపించగలడని, ప్రపంచమందలి సగం మందిని ప్రభావితులను చేసి ఎన్నో దేశాలలో సామ్యవాద ప్రభుత్వాన్ని స్థాపించుటలో విజయము సాధింగలడనుకోలేదు.



వైడెన్‌పావెల్ యొక్క స్కౌట్లు ఈ కాలమందే అందించబడ్డారు. దాస, దాసీల వ్యవస్థ దగ్గరనుండి జమీందారీ వ్యవస్థ యొక్క అబేధ్య మనిపించే కోట గోడలు కేవలము కొందరు తపస్వుల ప్రచండశక్తి ద్వారా బీటలు వారిపోయింది. ఇది కొద్ది రోజుల క్రితం సంభవము అవుతుంది అనేది ఊహకు కూడా అందనిది.

ఒకవేళ ఎవరికైనా పురాతన భారతదేశము యొక్క శక్తివంతమైన గొప్పతనముకు ఆధారము ఆధ్యాత్మయోగవిద్య అని అంగీకరించేందుకు ఆ మాట మీద మోహం లేకపోతే దానితో పాటు ఇది కూడా కలపాలి. ఆ భవ్య భవనము రెండు ఆధారాల ఇటుక, సున్నముల పునాది మీద నిర్మించబడింది. అందులో ఒకటి తపస్సు అనగా ఉత్తమోత్తమమైన సాహసము గల ప్రతిభతో సంపన్నము చేయుట. రెండవది సువ్యవస్థను సరిగ్గా ఏర్పరిచే ప్రావీణ్యతను ప్రాతినిధ్యము చేయగల నేర్పరితనము గల దృష్టికోణమును అలవరుచుకొనుట. ఈ రెండింటి కొరకు తీవ్ర ప్రయత్నము చేయగలిగితేనే ఆధ్యాత్మిక యోగవిద్య యొక్క వాస్తవిక అర్థము గ్రహించగలరు. ఆ స్థాయి ప్రగతి మాత్రమే బుద్ధి- సిద్ధి పేరుగల విజయాలను అంధిస్తుంది. అవి ఆకాశము నుండి పుష్పవర్షంలాగా కురవవు.

దక్షిణముఖముగా ప్రవహించే గంగానదిని తూర్పువైపుకు ప్రవహింపచేయడానికి భగీరథుని తపోగాథ ప్రసిద్ధిచెందినది. వారికే భాగీరథికి తండ్రిగా పిలిపించుకునే గౌరవము లభించింది. ఇలాంటి ప్రయత్నాలనే అనసూయాదేవి చిత్రకూటము సమీపాన మందాకినిని తన కోరిన దిశలో తీసుకుని వెళ్ళే ప్రయత్నము చేసింది. ఆమె తేజస్సు

చేత ప్రభావితులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు బాలురుగా మారి అలాగే ప్రవర్తించటకు వివశులైరి. పాండవుల చిన్న సమూహము కౌరవుల విశాల సైన్యాన్ని ఓడించింది. ఈ అద్భుత సామర్థ్యము వెనుక యోగ పురుషుడైన కృష్ణుని ప్రణాళికబద్ధరణ నీతి కలదు. వారే రధసాధ్యము చేసిరి. హనుమంతుడు పర్వతాన్ని పెకలించుట వెనుక ఆయన ప్రత్యక్ష శక్తి కాక పరోక్షశక్తి పనిచేసింది. జాంబవంతుని బోధ వలననే లంకాదహన కార్యము సుసంపన్నము చేశాడు. ప్రత్యక్షంగా చూస్తే పారిపోయిన సుగ్రీవుని సేవలోనున్న వాడే ఇతడు. పరశురాముని గొడ్డలి, అర్జునుని గాండీవము యొక్క శక్తిగాథలు వినేవారు రోమాంచితులౌతారు.

ఛత్రసాలమహారాజు దండెత్తిన రాజులతో పోరాడటానికి తగిన ఆర్థికశక్తి లేక ప్రాణనాథప్రభువు వద్దకు వెళ్ళాడు. ఆయన వరాన్ని ఇచ్చాడు. అదేమనగా సంధ్యాసమయానికి నీవు గుఱ్ఱము మీద ఎంత దూరము తిరుగగలవో ఆ భూమియంతటిలో రత్నాలు లభిస్తాయి. ఛత్రసాలుడు అదేవిధముగా చేశాడు. అతని ఆర్థిక బాధలు తీరిపోయాయి. వివేకానందుని ద్వారా భారతీయసంస్కృతి ప్రపంచమంతటా జెండా ఎగురవేయడానికి వెనుక ఆయన సమర్థ గురువగు రామకృష్ణ పరమహంస దివ్యశక్తి పనిచేసింది. మనిషి అంతరంగాన ఎన్ని అద్భుత శక్తులుద్భవిస్తుంటాయనేందుకు ఇవన్నీ ఉదాహరణలుగా కనిపిస్తాయి. యోగము తపస్సు మొదలగు ఉపచారాల ద్వారా తన ప్రతిభను తనలో మేలుకొలుపుట లేదా వృద్ధిచేయుట జరుగుతుంది. దాని యొక్క లాభము స్వయముగా పొందవచ్చు లేదా ఇతరులకు అందించవచ్చు.



# 4. ప్రతిభాసంవర్ధనకు రెండు ఆధారాలు సాహసము - సువ్యవస్థ

ఒక లోకోక్తి కలదు. **తనకు తాను సహాయపడువాడికే ఈశ్వరుడు కూడా సహాయము చేస్తాడు.** దీని వంటిదే ఇంకో లోకోక్తి కూడా కలదు. అందులో దైవము మీద దుర్బలుని హంతకుడు అనే ఆరోపణ తగిలింపబడుతుంది. గీతాకారుడు చెప్పినది ఏమిటంటే **మనుష్యుడు తనకు తానే శతృవు మరియు తనకు తానే మిత్రుడు.** ఇది వాని కోరికపై ఆధారపడివుంటుంది. అస్తవ్యస్థతను సొంతము చేసుకొని తనకు తానే దుర్గతి అనే గోతిలో పడేసుకుంటాడా లేదా చురుకుగా వుండి ఉన్నత శిఖరానికి అతి వేగముగా ముందుకు సాగిపోతాడా. గీతాకారుడు అర్జునుని మాధ్యమముగా ఉపయోగించుకుని ప్రతి ఒక్కడినుండి నిన్ను నీవు పైకి లేపుకో, జారిపడేటటువంటి దౌర్భాగ్యానికి లోను కావద్దు అని కోరాడు.

ప్రపంచము ఎంత సుఖప్రదమైనప్పటికి సుందరమైన మంచి వసతులు వున్నప్పటికినీ తనలో లోట్లు వున్నప్పుడు ఇంత విస్తారమైన సంపదంతా నిరర్థకమే అవుతుంది. తన కళ్ళు పనిచేయకపోతే ప్రపంచమంతటి సౌందర్యదృశ్యాలు సమాప్తము అయిపోయినట్లుగా భావించాలి. చెవులలో వినికిడి శక్తి లోపిస్తే ప్రవచనము చెప్పే వాళ్ళు, పరామర్శించేవాళ్ళు, గాయకులు, వాయిద్యాలు, మూగపోయినట్లే . మనస్సు చెడిపోతే ప్రపంచంలో వారందరూ తప్పుడు మార్గాన నడుస్తున్నట్లే అనిపిస్తుంది. పొట్ట పాడైపోతే లేక రక్తములో విషము

చేరితే జ్వరము, బలహీనత వంటి అనారోగ్యాల నుంచి, అకాల మృత్యువు ఆక్రమణ చేసి ఇప్పుడా ఇంకాసేపా అన్నట్లుగా పరిస్థితులు ఏర్పడ వచ్చు.

ప్రగతి యొక్క చరిత్ర ప్రణాళికా బద్ధమైన తన్మయత్వము మరియు తత్పరత అనే పునాది మీదనే వ్రాయబడుతుంది. ఇవి లేక పోతే పూర్వులు ఆర్జించిన సంపద వైభవములు అంతా చిచ్చుబుడ్డివలె వెలిగి క్షణకాలపు మనోరంజనము కలగచేసి తరువాతి పశ్చాత్తాపముతో తలవంచుకోవాలి. మన కర్మల యొక్క కలమే భవిష్యత్తు యొక్క మంచి, చెడుల సంభావనను వ్రాస్తూ వుంటుంది.

శరీరము పొడవుగా, వెడల్పుగా, బలముగా వుండటము అనేది ఒక విషయము మరియు సాహసము అనే ధనము వుండుట వేరే విషయము. ఇచ్ఛాశక్తి, సంకల్పశక్తి, ధైర్యము మరియు ప్రాణశక్తి తక్కువగా వుంటే అతడు పిఱికితనం, భయం వలన చింతతో సందేహంతో ఖిన్నుడుగా ఉద్విగ్నుడుగానే ఉంటాడు. కొంచెము కష్టము రాగానే దూది కూడా పర్వతము వలె పెద్దదిగా కనిపిస్తుంది. ఏదో ఒక విధముగా రక్షించుట, రక్షింపబడుట, అనే కోరిక మాత్రమే వుంటుంది. కష్టములు కాగితముతో చేసిన ఏనుగుల వలె పెద్దవిగానూ, భయము కలిగించేవిగానూ ఉన్నా సంకల్ప శక్తి యొక్క ఒక్క ఎదురుదెబ్బను కూడా అవి తట్టుకోలేవు అని తెలుసుకోడు.

ప్రతి చిన్న పరమాణువులో అనంత శక్తి నిండి వుంటుంది. ఒకవేళ దాని విస్ఫోటనను వినియోగించగలిగితే "ఏమిలేదు" అన్న దాంట్లోనే "అంతా ఉన్నది" అనే సశక్తత ఉన్నదని తెలుస్తుంది. అవసరమైన వరకే నిద్రనుంచి మేలుకొనడము జరుగుతుంది. సాధారణ మానవుడు



తనను తన కుటుంబాన్ని ఏదో విధముగా నెట్టుకుంటూ జీవితాన్ని గడిపేనగణ్య స్థాయి లో జీవిస్తాడు, ఎవరి అంతరంగములో ప్రణాళికాబద్ధమైన, వున్నతమైన గొప్ప కోరికలు తమ పనిని తాము చేసుకుపోతూ వుంటాయో. అతను ఎంత పెద్దపెద్ద గొప్ప పనులు చేస్తాడంటే, అది చూసి తోటివారు ఆశ్చర్యచకితులౌతూ వుంటారు. బయటకు చూడటానికి ఒకే విధముగా కనిపించే వ్యక్తులలో ఆకాశానికి, భూమికి వున్న తేడా కనిపిస్తుంది. ఈ తేడా ఎక్కడా బయట నుండి రావడము లేదు. వ్యక్తి వాటి నిర్మాణము తన చేతులతోనే చేసుకుంటాడు. ధైర్యము పెంచుకొనుట, సాహసాన్ని ప్రోదిచేసుకొనుట, పరాక్రమాన్ని చూపించుట, అనుచితమైన వాటితో పోరాడుట అనేది అసంభవమైనది కాదు, కఠినమైనది కూడా కాదు. ప్రగతి లోపలినుండి ప్రారంభమవుతుంది. బయట దానికి సంబంధించిన పరిణతి నీడే కనిపిస్తుంది.

పొద, చీకటిలో భూతములాగా కనిపించి భయపెడుతుంది. చీకటిలో త్రాడును పాముగా భావించి భీతి చెందుతారు. " శంకా డాయన్ - మనసా భూత్ " - అనుమానమే భూతంగా మనస్సును బాధిస్తుంది. ఈ లోకోక్తి పదహారు అణాల సత్యమె. ధైర్యవంతులు సుదీర్ఘ యాత్రలు ఒంటరిగానే చేస్తారు. కానీ పిరికి వాళ్ళు రాత్రివేళ బాత్రూమ్ (ఉచ్చ) పోసుకోవడానికి కూడా ఒకరిని తోడు తీసుకుని వెళతారు. రాణాసాంగాకు యుద్ధభూమిలో 80 కి పైగా గాయాలు తగిలినా లక్ష్యపెట్టకుండా రెండు చేతులతో ఆయుధాలు పట్టి ప్రాణము పోయేటంత వరకూ పోరాడాడు. భీష్మపితామహుడు అంపశయ్య మీద పడుకుని బాధను భరిస్తూ సూర్యుడు ఉత్తరాయణములోనికి వచ్చిన

తరువాతనే మరణిస్తానని చెప్పాడు. ఆ విధముగానే మృత్యుదేవత వెనక్కు మరలిపోయింది. ఆయన కోరిన విధముగానే జరిగింది. ఎవరో సత్యమే చెప్పారు - వీరుడు జీవితంలో ఒకేసారి మరణిస్తాడు, పిరికివాళ్ళు అడుగడుగునా మరణిస్తారు అని.

మానవుడు తన మానసికశక్తిలో 7% మాత్రమే తన శరీరానికి సంబంధించిన అవసరాలను గడుపుకోవటానికి ఉపయోగించు కుంటాడు మిగిలిన 93% సామర్థ్యము నిద్రాణంగా మూర్ఛావస్థలో తెలియని పరిస్థితులలో పడివుంటుంది. తన సంపదతో నిండిన ఖజానా తాళంచెవి పోగొట్టుకోవడంవలన ఎవడైనా దారిద్ర్యంతో తిరుగుతు వుంటే వాడి కొరకు ఎవరు ఏమి చేయగలరు? ఆత్మ నిర్మాణంలో కనుక లగ్నము కాగలిగితే, చెడు అలవాట్లను చెత్తాచెదారాన్ని నెట్టి వేసినట్లు తోసి వేయగలిగితే, దృష్టికోణంలో మానవత్వపు గొప్పదనానికి అనురూపమైన మంచిని నింపుకోగలిగితే, అడవిమనిషి వంటి నరుడుకూడా నారాయణుడుగా మారే కాయకల్పవిధానము లభించిందని అనుకోవచ్చు. అతనికి వ్యవస్థ చేయగలిగే బుద్ధి వికసించిందని చెప్పవచ్చును. తనకు, ఇతరులకు వ్యవస్థ ఏర్పరచడం ఒక మామూలు విషయంగానే అనిపించవచ్చు. కానీ నిజానికి దానికంటే గొప్పది గౌరవప్రదమైన వైభవము, వరము మరేదీలేదు.

సైన్యాధ్యక్షుడు కూడా ప్రారంభంలో ఒక సాధారణ సిపాయి స్థానంలో భర్తీ అవుతాడు. పై అధికారి అతనిలో వ్యవస్థ బుద్ధిని గమనించి దానిఆధారంగా అతనికి పదవులను పెంచుతు బాధ్యతలను అప్పగిస్తువుంటాడు. అతడు తన నేర్పరితనంతో అసంభవాన్ని సంభవము చేసిచూపిస్తాడు. దీని ఆధారంగానే గౌరవాన్ని పొందుతాడు.



కార్మాగారాలు, ఫాక్టరీలు, మిల్లుల ప్రాణశక్తి నేర్పరులైన యజమానుల మీద ఆధారపడివుంటుంది. వారి దూరదృష్టి వలన చిన్నచిన్న కార్ఖానాలు పెరిగి పెద్దవి అవుతాయి. తమ నేర్పరితనంతో అందరిని ఆశ్చర్యంలోపడవేసి అభివృద్ధిని గౌరవాన్ని పొందుతారు. సంస్థానాల యొక్క హుందాతనము మరియు ఉద్యమాలను శుభారంభము చేస్తు ముందుకు సాగుతు ఆశించలేని విజయములను ప్రతిభావంతులు పొందుతారు.

ఆంగ్లేయుల కాలములో ప్రాంతాలను పాలించే శాసనాధ్యక్షులను 'గవర్నర్' లు అని అనేవారు. కేంద్రీయప్రభుత్వపు సూత్రసంచాలకుడిని గవర్నర్‌జనరల్(వైస్రాయ్) అని అనేవారు. గవర్నర్ అంటే ఏర్పాటుచేయువాడు (ప్రభంధకుడు) అని అర్థము. తమ ఈ విశేషమువలన ఇంజనీర్‌లు గొప్పగొప్ప నిర్మాణకార్యాలను పూర్తిచేస్తారు. చిన్నచిన్న కుటీరపరిశ్రమలను ప్రారంభించి దాన్ని ప్రారంభించిన వారు చూస్తువుండగానే ధనసంపాదనలో కుబేరులుగా మారతారు. ఆపదలను ఎదుర్కొనుట, ప్రగతిని సాధించుటలో ఎవరైతే విజయాన్ని పొందుతారో వారియందు సాహసము, సువ్యవస్థఅనే రెండు గుణాలు నిశ్చయంగా వుండివుంటాయి.

శక్తి - శక్తే. దానిని మంచిపనులలో వలె చెడు పనులలో కూడ వుపయోగించవచ్చు. రాక్షసులు, దైత్యులు, బాధించేవారు, అనాచారులు మొదలైనవారంతా ఈ విశేషత ఆధారంగానే రోమాంచితము చేసే దుష్కర్మలు చేస్తూంటారు. అవినీతిని ఆచరిస్తూకూడా తమ ప్రతాపము వలన దూరదూరాలకు సమస్యలు, కష్టాలు కలిగించే దస్యులు, తస్కరులు దొంగలు తమ విజయానికి కారణము తమ సాహసము,

వ్యవస్థ చేయగలిగే గుణము అని దండోరావేసుకుంటారు.

సద్గుణాలలో వివిధ ధర్మాలు, వ్రతనియమాల వర్ణన వుంటుంది. వాని కారణంగా స్వర్గము, మోక్షము, బుద్ధి-సిద్ధుల విభూతులు హస్తగతమౌతాయంటారు. ఈవిధమైన ప్రతిపాదనలు సంయమనము మరియు పరమార్థముల గొప్పదనములను తెలుపుతాయి. వీటన్నింటి ఉద్దేశ్యము వ్యక్తిత్వము స్ఫూర్తివంతంగా, శ్రమ చేయగలిగేదిగా వుండాలని. మనస్సును పనిలో పూర్తిగా లగ్నము చేయుట వలన ప్రతిష్ఠ, వరిష్టత, విజయము, సామర్థ్యము పెరుగుతాయి. మానవీయగరిమకు అనురూపంగా తన గుణ, కర్మ, స్వభావాలను నిర్మాణము చేసుకుంటే ప్రపంచమునకు ఒక క్రొత్త దేవత అంద చేయడమౌతుంది. వ్యక్తి బహిరంగంగా దేన్ని ఆచరిస్తాడో దాన్ని అనేకులు అనుసరించి దాని ప్రభావంతో అనుప్రాణితులౌతారు, మార్గదర్శనము పొందుతారు. అంతవరకు ఎందుకు, చనిపోయిన తర్వాతకూడా హరిశ్చంద్రుడు, భగీరథుడు వంటి వారి కథలు శాశ్వతంగా అనేకమందికి ప్రేరణలను ఇస్తూనే వుంటాయి. ఇదే విషయము అంతరంగానికి కూడా వర్తిస్తుంది. వ్యక్తి చింతన, నడవడి, నమ్మకము, విశ్వాసము, శ్రద్ధ, ప్రజ్ఞ, నిష్ఠ వున్నతస్థితిలో వుంటే వాని ప్రభావము ఎంతోమందికి, ముఖ్యంగా అతని సంపర్కక్షేత్రమునందు వుండువారికి బాగా వుత్తేజాన్ని అందిస్తుంది. అతని తేజోవలయము అంతరిక్షంలో ఎగురుతుంది. అది ఎక్కడకి చేరితే అక్కడ తనకు అనురూపమైన చేతనత్వాన్ని వసంతాన్ని వికసింపజేస్తూవుంటుంది.

పారసమణిని తాకిన లోహము బంగారముగా మారుతుందా? లేదా? ఈ విషయంలో



సందేహాలుండవచ్చేమో కానీ ప్రతాపవంతుడైన వ్యక్తి అసంఖ్యాకులను తన అనుయాయులుగా, సహయోగులుగా తయారుచేసుకుంటాడు అనేది సునిశ్చితము. మహామానవుల జీవనగాథలు ఈ విషయాన్నే బలపరుస్తాయి. వారు తమ ప్రామాణికత, ప్రఖరతల శక్తితో అన్నివైపులనుండి ప్రాణశక్తిని సంగ్రహించి ఊహకందని స్థితికి చేరుకున్నారు. తాము స్వయముగా చేయలేని పనులను కూడా కేవలము తమ ప్రభావముద్వారా ఆ పని యితరులతో చేయించడములో వారు సఫలీకృతు లయ్యారు. ఇటువంటి దివ్యసామర్థ్యమును సముపార్జించి ఆ శక్తితో అస్తవ్యస్తమైన వ్యక్తుల జీవితాలను సునియోజితరీతిలో మార్చగలగడము అనేది లభించిన వరదానములను సఫలము జేసుకొనుటయే. దానము ఇవ్వడము వలె ఇప్పించుట కూడా పుణ్యకార్యమే అని చెప్పాలి. సాహసము, సువ్యవస్థ అనే రెండు గుణములు ఎవరిద్వారా క్రమశిక్షణతో అభ్యసింపబడుచున్నవో వారి సర్వతోముఖీ ప్రగతికి ఎవరో ద్వారములు తెరిచారని భావించాలి. కానీ ఆ అవిజ్ఞాతశక్తిపుంజమునకు జయజయధ్వనులు ఎక్కడా వినిపించవు.

మానవులలో అధికభాగము ఒకేలాంటి ఆకారము-స్వభావము కలిగి ఉంటారు. వారి ఆహారము, త్రాగటము, నిద్రించుట, మేల్కొనుట అన్నీ ఒకేలాగ వుంటాయి. కొంతమంది సాధనాలు లేవని బాధపడుతువుంటారు, కానీ ప్రతిభావంతులు అవే సాధనాలతో నాలుగురెట్లు, వందరెట్లు పనిచేస్తారు. ఆ పని వారి యశస్సు, ప్రభావము, కుశలతలను యెంతగా పెంచుతుందంటే చూచేవారు ఆశ్చర్యచకితులు కాక తప్పదు. దానితోపాటు సహయోగము నిచ్చే

సమూహముకూడా అనాయాసంగా ఆకర్షింపబడుతుంది. వానరులను, ఎలుగుబంటులను, గోపబాలురను, భిక్షువులను, పరివ్రాజకులను, సత్యాగ్రహుల సముదాయములను ఆహ్వానించుటకు సంఘటితపరచుటకు ఎవరు, ఎక్కడికి వెళ్ళి ప్రయ్నతము చేశారు? పూలమీదకు సీతాకోకచిలుకలు, తేనెటీగలు ఎక్కడెక్కడినుండో పరిగెత్తుకుని ఎలా వస్తున్నాయి? సాధరణ సౌకర్యములు కూడా లేని మహామానవుల జీవితాలు ఎంత ఆకర్షణీయంగా ఉంటాయంటే ఎంత కష్టమైనది అయినా దానిని ఆచరించుటకు అనేకులు ఆతురతతో, ఆదర్శముల మార్గములో అడుగులు కలిపి నడుచుటకు ముందుకు వస్తున్నారు.

ప్రపంచములో కనిపించే భవ్యమైనవన్నీ కేవలము సాధనముల సహకారముతోనే నిలుచుట లేదు. వాటివెనుక ఎందరో సృజనశిల్పుల మేధస్సు మాయాజాల చమత్కారములు చూపించి, సరియైన సమయములో దాని ప్రణాళిక వేసి, ఒక మూస తయారుజేసి, వారు అనుకున్న తారతమ్యములను అందులో ప్రయోగించినతర్వాత స్వప్నములను సాకారము చేసుకునేందుకు తమనుతాము పూర్తిగా సమర్పించుకుంటారు. ఈ ప్రక్రియ పేరు సఫలత. దానిని వరించుటకు ఇతరులను బ్రతిమాలిసిన అవసరము లేదు. వ్యక్తి తన తెలివిని సరియైవిధానములో పదును పెట్టి ఎక్కువ బాధ్యతలను భుజముల కెత్తుకుని దానిని నిర్వహించుకుంటూ వెళ్ళాలి. ఈ విధముగా వికసించిన ప్రబంధముచేయ గలిగె శక్తి మూలముగా అతను ఎక్కడికి వెళ్ళినా పరమపూజ్యుడవుతాడు. వ్యక్తిని సాధారణస్థితినుండి అసాధారణముగా మార్చగలిగిన ఈ శక్తియే అన్నింటికంటే గొప్ప దైవీ విభూతి.



## 5. విశిష్టత యొక్క సునియోజనము

లేమితో బాధపడేవారు సమస్యలను ఎదుర్కొనవలసి రావడము అర్థము అవుతుంది, కానీ ఆశ్చర్యము ఏమిటంటే మనకు ఇంత విపులమైన సాధన సామగ్రిపై అధికారము వున్నప్పటికీ దానినిగురించి తెలియకపోవడము చేత మానవులు స్థబ్ధతతో జీవిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు విన్నప్పుడు ఆ తెలియనిదనాన్ని మన దౌర్భాగ్యముగా భావించి దుఃఖము వ్యక్తము చేయడముమాత్రమే జరుగుతున్నది.

ఒక అయోగ్యుడు తండ్రి తన కిచ్చిన వజ్రాలను గాజు ముక్కలు అనుకుని ఇంకో అయోగ్యడికి అమ్మి జీవితాంతము దారిద్ర్యముతో గడిపాడట. మాణిక్యములమాల దొరికిన ఒక అడవిజాతివాడు దానిని గవ్వల మూల్యమునకు అమ్ముకున్నాడుట. కస్తూరీమృగమునకు నాభియందు కస్తూరీ వుంటుంది, కానీ ఆ సుగంధము ఎటునుండి వస్తున్నాదో అని వెతుకుతూ అది పరిగెడుతూ అలసిపోయి ప్రాణాలు వదులుతుంది. అగ్గిపెట్టె జేబులో వుంచుకున్న విషయము గుర్తులేక కట్టలకొద్దీ ఎండు గడ్డిమోపులు ప్రక్కనే వుంచుకునికూడా ఒక యాత్రికుడు చలికి ముడుచుకుపోయి మరణించాడు. ఇంటి ఆవరణలోనే ఖజానా వున్న విషయము తెలియక కూలివాడు కూలి దొరకనిరోజు అర్ధాకలితోనే పడుకోవలసి వచ్చింది. ఇటువంటి సంఘటనలను దాదాపు కుతూహముకొద్దీ వినడము జరుగుతుంది. విన్న తరువాత ఆశ్చర్యము కలుగుతుంది.

దారితప్పిన యాత్రీకుడు రాత్రంతా వృధాగా నడిచి చేసిన తప్పు తెలుసుకున్నతరువాత తిరిగి వెనక్కి చేరుకుంటాడు. పాడుబడిన

కోటలో వుండే వంకరటింకర దారులమూలంగా దూరినతరువాత తిరిగి వెళ్ళవలసిన ద్వారము యేదో తెలియదు. కంగారు మూలముగా మానసికస్థితి ఇంకా దిగజారిపోతుంది. చాలామంది ఇలానే దారితప్పి చాలారోజులు తిరిగితిరగి మరణించారని వింటుంటాము. ఎండమావులను చూచి నీరు అనుకుని మృగతృష్ణల వెంట పరిగెత్తు లేడిని దాదాపు ఇందుకు ఉదాహరణగా చెప్తాము. సింహపుపిల్ల గొఱ్ఱెల సమూహములో పెరిగితే అది తననుతాను గొఱ్ఱెగానే భావించుకుంటుంది. తరువాత దానికి ఆత్మబోధ చేసినట్లయితే అది ఆ సమూహమునుండి వేరుపడి సింహములతో చేరిపోతుంది. స్వప్నముల యందు కూడా కలగాపులగమైనవాటినేచూస్తుంటారు. మత్తుపదార్థములు సేవించిన వ్యక్తి ఆ మత్తు దిగుతున్నప్పుడు మాట్లాడే మాటలలో ఎటువంటి వాస్తవికత కనిపించదు.

ఇటువంటి ఘటనలు వస్తుస్థితి గురించి సరైన అవగాహన లేకపోవడము వలననే జరుగుతాయి, కానీ ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే వ్యక్తి ఇటువంటి విసంగతులతో, దారితప్పినస్థితిలో కొట్టుమిట్టాడటము అనేది కొద్దిరోజులు మాత్రమేకాదు దాదాపు తన జీవితమునే పణంగా పెట్టేస్తాడు. సాధారణవ్యక్తి తనకు సంబంధించిన అనేక సమస్యలను, కాఠిన్యములను, సమస్యలను, చింతలను, వ్యవస్థలను తలకెత్తుకొని వాటికి సమాధానము వెతకలేక ఎవరెవరినో ఆశ్రయిస్తాడు. ఎప్పుడో అప్పుడు ఏదో చిన్న పెద్ద సహాయము కొరకు చేయి చాపవల్సివస్తుంది, కానీ ప్రపంచమే సమస్యల మయమైనపుడు ఎవరు, ఎవరికి, ఎంత వరకు, ఎంతకని సహాయము చేయగలుగుతారు? విశేష మేమిటంటే అందరూ ఎప్పుడూ తమతమ సమస్యలలో ఎంత చిక్కుకుని వుంటారంటే ఇతరులకు సహాయము



చెయ్యాలి అనే పరిస్థితి వుండదు. అంతటి కోరిక, తీరిక కూడా ఎవరికీ వుండటములేదు.

తన తప్పులను తెలుసుకుందాము అనే అలవాటు ఎవరికీ లేదు. భ్రమలలో అన్నింటికంటే పెద్ద భ్రమ ఏదంటే ప్రతి వ్యక్తి తన ఆస్తి తక్కువని, ఇతరులకి తనకన్నా నాలుగు-వందరెట్లు ఎక్కువ సంపద ఉన్నదనీ తలచడము జరుగుతున్నది. వాస్తవానికి దోషములు లేనివ్యక్తి వుండడు, కానీ తన తప్పులు తెలుసుకోవడము ఎలా? అలా చేస్తే అప్రతిష్ఠ పాలవుతారు, పరువుపోతుంది, తమ సర్వజ్ఞత్వానికి హాని కలుగుతుందికదా! అందుచేత అలాంటివారు ఏదైనా పని పాడవుతే దాని దోషము తమపై వేసుకోక తేలికగా ఇతరులపై దోషము మోపుతారు. కొందరు ఇతరులను దోషులుగా నిలబెట్టడమువలన వారు ఎదురు తిరిగితే వచ్చే సమస్యలకు భయపడతారు. ఎదురుతిరిగి వాదించరు. అందువల్ల దోషారోపణ చేసేవారు నోట్లో నాలుక లేని ఒక అసహాయుడిని ఏరికోరి ఎన్నుకుంటారు. అదృష్టచక్రము, కాలము కలసిరాకపోవడము, గ్రహదశలు, విధాతయొక్క విధానము, నొసటిరాత మొదలగు వాటిపై చాలామంది దోషారోపణలు చేస్తువుంటారు. దోషము ఆరోపించబడ్డ పై పరిస్థితులు దానిని ప్రతిఘటించలేవుకదా! వారు దానిని తుడిచివేసుకునే ప్రయత్నము చేయరు. ఇటువంటి స్థితిలో ఆరోపణ చేసిన వ్యక్తి తన నమ్మకాన్ని ఇంకా బలపరచుకుని, వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుంటాడు.

ఒకరిపై ఆరోపణలు చేసే ప్రవృత్తి ఒక వైపు, రెండవవైపు ఆత్మసమీక్ష చేసుకునే ప్రవృత్తి లేకపోవటము వల్ల చాలా మంది భ్రమకు లోనవుతున్నారు. తమ సామర్థ్యమును చాలా తక్కువగా అంచనా వేసుకుని అందువల్ల మేమేమీ చేయలేము అనే చెడు

కల్పనలకు కూడా చాలామంది లోనవుతారు. దాన్ని పెంచుకునేందుకు ఏమి చెయ్యాలి? ఉత్కర్ష కొరకు సుయోగము లభించడము అనేది మన చేతిలో లేదు కదా ! మంచిచేయడానికి ఇన్ని ప్రయత్నాలు చేశాము, ఇంతకంటే ఎక్కువ చేయడానికి ఇంక అవకాశమెక్కడిది? ఇలా ఆలోచించుకుంటూ ఆత్మసమీక్ష (సెల్ఫ్అనాలసిస్), ఆత్మసవరణ (సెల్ఫ్ కరెక్షన్), ఆత్మనిర్మాణము (సెల్ఫ్ డెవలప్‌మెంట్), ఆత్మవికానముల (సెల్ఫ్ ఎవల్యూషన్) అవకాశమును పోగొట్టుకుంటున్నారు. ఉపాయమేమి తోచనప్పుడు లోలోపల కుములుతూ, విసుక్కుంటూ, కోపగించుకుంటూ, ఉద్విగ్నులవుతూ చింతాగ్రస్థులవడము మినహా ఇంక ఏమి చేయగలము. దుష్కల్పనల వల్ల అనేక రకాల ఒత్తిళ్లకు గురి అయి దిగజారి నీరుకారిపోవడం అతి సులభంగా జరుగుతుంది. లోకులు ఇలానే చేస్తున్నారుకూడా!

ఇలా వ్యాపిస్తున్న భ్రాంతులను భయంకర అంటు వ్యాధులుగా చెప్పినట్లయితే ఎటువంటి అతిశయోక్తి వుండదు. మానవునిలో అంతర్గతంగా వున్న శక్తులను కనుక ప్రసుప్తస్థితినుండి జాగృతపరచి క్రియాశీలము చేయగలిగితే సామాన్యుడుగా కనిపించే వ్యక్తి తనని తాను అసామాన్యునిగా రూపొందించుకొనగలడనే విషయమునుగురించి తెలుసుకునే సుయోగము జనసామాన్యమునకు లభించడం లేదు. ఇందులో ఎటువంటి రహస్యము లేదు. నమ్మదగినది కానిది అంటూ ఏదీ లేదు. పురాతన ఇతిహాసముల గతివిధుల మీద కొంచెము గంభీరతాపూర్వకంగా దృష్టిసారిస్తే మనము ఇటువంటి ఎన్నో ఉదాహరణలను కంటితో చూడగలముతాము, చెవులతో వినగలుగుతాము. వీటిలో ఆత్మవిశ్వాసము మరియు ప్రచండ సాహసముయొక్క ఆధారముగా ప్రగతిదిశవైపు బుద్ధి



కుశలతతో వెళ్ళే ప్రయత్నం చేయబడినది. అందువల్ల క్రమక్రమంగా అధిక ఉపయుక్తమైన అవకాశాలు లభిస్తూ వచ్చాయి. చివరికి ఎంతయెత్తుకు చేరుకోగలిగిగారు అంటే ఆశ్చర్యపోయి ఇవి దైవీ వరదానాలేమో అనే భ్రమ కలుగుతుంది. దీనికి విపరీతముగా అనేక ఉదాహరణలలో వ్యక్తి అపార సాధనాసంపత్తి మరియు అవకాశములు వుండికూడా దుర్గణములకు బలియై రోజురోజుకు పతన-పరాభముల వైపు దొర్లుకుంటూ చివరికి దుర్గతిపాలయి దౌర్భాగ్యుడిగా ముద్రవేయించుకుంటాడు.

సాధారణ దృష్టికి పృథ్వి స్థిరముగా ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ విషయము అర్థము చేసుకున్నవారు భూమి తన ఇరుసుపై గుండ్రముగా బొంగరము వలె తిరుగుతువున్నదని, సూర్యునికి పరిక్రమ చేయడముకొరకు బాణమువలె అంతరిక్షములో దూసుకుపోతూ పరిగెడుతూవుంటుందని తెలుసుకుంటాడు. మానవుని విషయములోకూడా ఇలానే జరుగుతూవుంటుంది. అతని జీవిత చర్య అగ్రగామిగా ముందుకు పోవటానికి అవసరమైన అవకాశాలు అడుగు అడుగునా వున్నాయి. లోటు కేవలము వాస్తవస్థితి అర్థము చేసుకుని దానిని విశ్వసించగలిగే వివేకము జాగృతము కాకపోవడమే. మనిషిపై దీనత్వము, హీనత అనే పొరలు ఎంత మందముగా కప్పబడివున్నాయంటే అదే వాస్తవస్థితి అనిపిస్తుంది.

పై భ్రమలనుండి బయటపడటానికి చేసే సామాన్య ప్రయత్నములను చుట్టూవున్న వాతావరణము చెడగొడుతుంది. అహంకారుల సముదాయములు యితరులను హేయముగా చిత్రీకరిస్తూ తమ గొప్పదనమును పరిపుష్టి చేసుకుంటూవుంటాయి. ఇటువంటి సముదాయములలో ఉన్న మనకంటే సమర్థులైనవారు

వారి స్థాయిలో అలాగే సమీక్షిస్తూవుంటారు. ఈ పెద్దవారి మాటలు అందరూ ఒప్పుకుంటారు కూడా. ఈ మాటలను సాధారణ మానవుడు హృదయంగమము చేసుకొని తనని తాను కించపరచుకుంటాడు. పెద్ద పనులు లేక పెద్ద బరువులుగానీ మోయడము తనవల్ల కాదు అనుకుంటాడు. అందుచేత ఏవిధంగా రోజులు గడుస్తున్నాయో ఆవిధంగానే సంతోషముగా గడిచిపోతే అదే చాలు అనుకుంటాడు. సంకటములను సహిస్తు, దుర్దినములతో కలసిమెలసి వుండము అలవాటుపడతాడు. ఈవిధమైన మానసికస్థితి ఏర్పడినప్పుడు సామార్థ్యములన్నీ ఇంకా లోతులలోకి వెళ్ళిపోతాయి. వాటిని పైకి లేపడానికి, వృద్ధిపొందించుటకు, లోపలనుండికానీ, బయటనుండికానీ ఏవిధమైన ప్రయత్నము జరుగకపోతే ముందుకుపోవడము, ఎత్తుకు ఎదగడము ఎలా సంభవమవుతుంది? ఆ దిశలో గట్టి ప్రయత్నములెలా జరుగుతాయి? కోరికలే చచ్చిపోతే మరి అగ్రగాములయ్యే అవకాశములు ఇంటికప్పు పగలగొట్టుకుని ఆకాశమునుండి ఎందుకు ఊడిపడతాయి?

ప్రపంచములో డబ్బుయొక్క మెఱుపులు చాలా చోట్ల కనపడుతూనే వుంటాయి. మరియు డబ్బుతో కొనగలిగేవి కూడా తమ చమక్కులు-మెఱుపులు చూపిస్తూ కళ్ళను మిరుమిట్లు గొలుపుతుంటాయి. కొందరి రూప లావణ్యాలు మన్మోహనంగా కనపడుతరావుంటాయి. కళాకారులు, ఉద్యోగస్తులు, గుణవంతులుకూడా చాలా మంది కనపడుతువుంటారు. కానీ తమ సాహసముతో, పౌరుషముతో అవరోధములను దాటి ప్రగతి పథమును ప్రశస్తము చేసినవారు చాలా తక్కువగా కనపడతారు. పడిపోయినవారిని లేపి, లేచినవారిని నడిపించి, నడిచేవారిని పరుగెత్తించి, పరుగెత్తేవారిని గంతులు వేయించేవారు చాలా అరుదుగా ఉంటారు. తమ మార్గములో



తాము వెళ్ళడమనేది అందరూ చేసే పనే, కానీ తమ నావలో అనేకులను కూర్చోబెట్టుకుని ఒడ్డుకు చేర్చగలిగినవారే ప్రశంసకు పాత్రులౌతారు.

ప్రచండమైన సామర్థ్యమును లోపల వుంచుకుని దానిని సదుపయోగము చేయకపోగా కనీసము వున్నది అని కూడా గుర్తించలేనివారు ఎంతటి దౌర్భాగ్యులు. ఆత్మవిస్మృతి అనేది ఎంత భయంకరశాపమంటే తెలిసో, తెలియకో లోకులు దానిని భరిస్తూ తమ భుజములపై మోస్తూ వుంటారు. దీనినే ప్రతిభా - లేమి అంటారు. ఆంతరికదృష్టితో చూస్తే ఈ ప్రతిభా - లేమి గొప్పగొప్ప పహిల్వానులలో కూడా కనిపించి ఆశ్చర్యపరిచేవిధంగా వ్యక్తమవుతూవుంటుంది. గొఱ్ఱెలు, పొట్టేళ్ళు తమలో తాము ఢీకొట్టుకుంటూ దర్పముతో కూడిన శారీరక బలప్రదర్శనలిస్తూనే వుంటాయి. తీతువుపిట్టలు, కోళ్ళుకూడ యుద్ధము చేస్తూ తమ అహంకార ప్రదర్శనలు ఇస్తాయి. ఇది వాస్తవిక బల ప్రదర్శన కాదు. మనస్సులోని ఏ దిశాధార ఆ బలమును ప్రయోగిస్తోంది అనేది తెలుసుకోవాలంటే లోతులలోకి వెళ్ళి చూడాలి. గుండాలు, విప్లవకారులు, ఆకతాయిలు, అనాచారులు తమ దర్పమును ప్రదరిస్తూ గొప్పలు పోవడము చూస్తుంటాము. ఇతరులపై అధికారమును ప్రదర్శిస్తూ వారిని భయపెట్టి ఉచిత అనుచితాలను తమకు అనుగుణ్యముగా మార్చడముకొరకు ప్రయత్నాలు చేస్తారు. ఇటువంటివారి శారీరక బలిష్టతను ఎలా మెచ్చుకోగలము? బుద్ధిబలము, ధనబలముల విషయాలలోకూడా ఇలానే ఆలోచించాలి. వీటిని దురుపయోగము చేసేవారు తమకు తాము హాని కలిగించుకొనుటయేకాక ఇతరులకుకూడ సమస్యలు తెచ్చిపెడతారు. కళయొక్క దురుపయోగము కూడా తక్కువేమి జరుగుట లేదు.

శృంగారము, విలాసము, అనైతికత వంటి పశుప్రవృత్తులను రెచ్చగొట్టడానికి సంగీతము, చిత్రకళలు, సాహిత్యములన్నీ తమవంతు పాత్ర బాగానే అందిస్తున్నాయి. ఇటువంటి స్థితిలో ఆ కళను ఎలా ప్రశంసించగలము? అది అందరినీ ఆకర్షించి ప్రభావితము చేయగలుగుతోంది, కానీ బదులుగా పూర్తి ఖరీదును కూడ వసూలుచేసుకుంటోంది. కానీ ఈ స్థితియొక్క పరిణామములను పరిశీలించినట్లయితే వారు ప్రఖ్యాత కళాకారులు కాకుండా ఏవిధమైన ఖ్యాతి లేని, ఎవరికీ తెలియని సాధారణ మానవుల వలె వుంటేనే ఎంతో బావుండేది అని అనిపిస్తుంది. అప్పుడువారు లోకులకు తమ చమత్కాములతో, పేరాశను కలిగించి, చెడుమార్గములో ప్రయాణింపచేసే అకృత్యము చేయకుండా వుండేవారు.

ఏ ఉపలబ్ధులు హస్తగతమైనాయి? ఇది గమనించినంత మాత్రముననే సరిపోతుందా? అది లోకహితముకొరకు ఎంతవరకూ ఎలా వుపయోగపడినది? అనేది కూడా అంచనా వేసుకోవాలికదా! ఈ గీటుఱాయిపై పరీక్షించుకొనుటను వదిలివేస్తే సర్పములు-తేళ్ళయొక్క శరీర సంరచన కూడా ప్రశంసకు పాత్రత కలిగివుంటుంది. పులులు, తోడేళ్ళు కూడా ఇతరములతో పోలిస్తే శరీర బలిష్టత కలిగివున్నందువలన ప్రతిష్ట పొందుటకు తాముకూడా అధికారులమని భావిస్తాయి. అప్పుడు వాటికి భయపడటము, రక్షించుకోవడముల ఆవశ్యకతే వుండదు. ఎవరి బలము, కౌశలము సదుద్దేశ్యముల కొరకు వుపయోగ పడుతుందో అవి మాత్రమే ప్రశంసనీయము. అలాకాకుండా వృద్ధిచెందిన ప్రతిభ దుప్పులకు పెరిగిన కొమ్ములవలె చూడటానికి కుతూహలము కలిగిస్తుంది, కానీ తన ప్రయత్నములకు ప్రయోజనములకు ఎటువంటి తోడ్పాటును ఇవ్వడానికి సమర్థత కలిగివుండదు.



## 6. ఈ విశ్వములోని అతి పెద్ద శక్తి

ప్రపంచము యొక్క విస్తృతమైన ఇతిహాసముల గడచిన కాలమును పర్యవేక్షించినట్లయితే ఒక సత్యము బోధపడుతుంది. అదేమిటంటే లాలసలు, వాసనలు, ఆకాంక్షలతో పీడింపబడినవారు అనేకులు వున్నప్పటికీ వారిలో కొందరే సఫలీకృతులయ్యారు. కారణము బాగా అలంకరించిన దుకాణములు వున్నప్పటికీ మూల్యము చెల్లించుటకు జేబులో డబ్బులు లేకపోవడముచేత చాలా మంది నిరాశతో వెనుతిరగవలసివస్తుంది. ప్రపంచ బజారులో అమ్ముడుపోయేవి ఒకదానినిమించి మరొకటి ఆకర్షణీయముగా వున్నాయి. కానీ బదులుగా వెల చెల్లించాలికదా! అది మరి మన దగ్గర లేనప్పుడు అటుయిటూ తిరిగి, అలసిపోయి, నిరాశతో భారమైన నిట్టూర్పులు వదలుట మినహా మనచేతిలో ఏముంది? రెండవపక్క కొంతమంది లక్షల రూపాయల సరుకును కొద్ది సమయములోనే కొని అమ్ముకుని లాభాలతో సంచులను నింపుకుంటారు.

భాగ్యోదయము, వరదానము మరియు అనుగ్రహము ఉదారత లేక అనుకంప అనే పేర్లతో చాలా పొందాలనే కోరిక, ఆశను పెంచుకుంటాము. కానీ ఇవన్నీ కలిపినా కూడా మంచుబిందువుల కంటే ఎక్కువేమి కావు. ముత్యములు చెమటనుండే రాలతాయి, సంపదలు శ్రమ వల్ల లభిస్తాయి. ప్రగతి కొరకు సాహసము చూపుటతప్ప యింకో మార్గము లేదు. ఎవరు ఎంత సరంజామాను ప్రోగుచేసుకున్నప్పటికీ దానిని సువ్యవస్థితము, సునియోజితము చేయకపోతే అవి అలిగి పలాయనము చిత్తగించుటను ఎవరూ ఆపలేరు.

శక్తియొక్క మహిమ, మాహాత్మ్యము చాలా గొప్పవి, కానీ అది సరిగా సంచాలనము చేసే విద్యతో పరిచయము వున్నవారివద్దనే నిలుస్తుంది.

ప్రపంచములో ఒకదానినిమించి మరొకటిగా నిర్మాణాలు వున్నాయి. పనామా కాలువ, సూయజ్ కాలువ, పీసాకు చెందిన వంగిన మీనార్, చైనాగోడ, అంగకోరవాట్(కంబోడియా)కు చెందిన అవశేషాలు, ఈజిప్టుదేశపు పిరమిడ్‌లు, ఆగ్రాలోని తాజ్‌మహల్, హౌరాకు చెందిన వంతెన వంటి మహానిర్మాణాలను చూసి జనులు ఎంతో ఆశ్చర్యచకితులవుతూవుంటారు, ఇవన్నీ అనేక సాధనాలకుప్పలు అని తప్పించుకునే ప్రయత్నము చేయకూడదు. గమనించవలసిన ఇంకో విషయమేమింటంటే దీనివెనుక ఎంతమంది తమ ఊహలకు ప్రణాళికరూపము నిచ్చి, ప్రత్యక్షముగా రచనాత్మక రూపముగా నిలబెట్టడానికి ఎంత కుశలతను, ఏకాగ్రతను వెచ్చించారు అనేది? సారాంశమేమిటంటే మానవుని వర్చస్సు ఎక్కడ మెఱుస్తుందో అక్కడ ఆకాశమందలి విద్యుత్తు వలె గర్జిస్తు తన సామర్థ్యమును చాటుకుంటుంది.

డార్విన్ కథనానుసారము సాధారణ మానవుడు కోతియొక్క సంతానమని, అడవిమనిషి యని ఒప్పుకుని తీరాలి. ప్రాణుల వికాసముయొక్క విజ్ఞానులు, సృష్ట్యాదిలో కేవలము అమీబావంటి ఏకకణ జీవులే వుత్పన్నమైనాయనీ, కానీ వాటిలో ప్రచండమైన ఇచ్ఛాశక్తి విద్యమానవమైవుండేదనే విషయమును చెప్తూవున్నారు. అదే కదలికగా మారి మనోబలముతో ఆ ప్రాణికి ఉచితమైన క్రియాశీల శరీరము తయారైనది. అవి అంగ ప్రత్యంగములు, వాటి స్వభావములు, క్రియా కలాపాలకి అనుగుణ్యమన నిర్మాణము, తమ జీవనానికి కావలసినవి సమకూర్చుకొనే శక్తి, వీలు సమకూర్చుకొన్నాయి. ఇంకా వారు



చెప్పేదేమంటే జడములుగా చెప్పబడే పదార్థములపై కూడా ప్రాణుల యొక్క ప్రచండ ఇచ్ఛాశక్తి పనిచేసి ప్రతికూలతల మధ్య అనుకూలతలను వుత్పన్నము చేసుకుంటుంది.

ప్రజలకు డబ్బు, రూప-సౌందర్యము, శిక్ష, పదవి, గౌరవము-సహయోగముల విలువ తెలును. అందువల్ల వాటికొరకు తహతహలాడుతు, హడావిడిగా పరుగెడుతూవుంటారు. కానీ ఎవరైతే అర్థమూర్ఛితస్థితి, అర్థమృతస్థితి, నిర్లక్ష్యము, నిరాశ, హతాశులవడము వంటి బురదలో చిక్కుకొనుటను తిరస్కరిస్తారో వారికిమాత్రమే చెప్పుకోదగిన ఉపపలబ్ధులు హస్తగతమౌతాయి. **లోపలినుండి ఉప్పొంగే శక్తి బాహ్యముగా అన్ని క్షేత్రములయందు తన వర్చస్సుయొక్క ప్రభావమును అడుగడుగునా పరిచయము చేస్తుంది.** తమ సంకల్పము నుండి వుద్భవించి, అనుకూల రూపము ధరించుటలో అన్ని ప్రాణి జాతులు, ప్రజాతులు, సంరచనలు తమ ప్రామాణికతను పరిచయము చేస్తాయి.అవి ఏదో అజ్ఞాత ప్రేరణ ద్వారానే తమ నిర్వహణ సాధనములను సమకూర్చుకున్నాయి మరియు ప్రకృతి ఆవశ్యకతలను పూర్తిచేయుటకు ఏదో అజ్ఞాత ప్రేరణకు వశులై తమనుతాము విశేష మూసలో మార్చుకున్నాయి. ఇది ప్రాణులయందు పదార్థములయందు విద్యమానవైవుండి తన అద్భుతశక్తిని పరిచయము చేసే సంకల్పశక్తియే. ప్రాణులన్నింటిలోనూ నిజముగా మానవుడు గొప్పవాడు. సృష్టి ఈశ్వరుని సంరచనగా చెప్పబడుచున్నది. కానీ ఈశ్వరుని వర్తమాన స్వరూపమును ఎవరు తెలుసుకోగలరు? దీనికి సమాధానము వెతుకుతూవుంటేఒక సత్యము నిరూపితమవుతుంది. అదేమిటంటే దానిని మనిషే తయారుచేశాడు.

ఎప్పుడు-ఎప్పుడు ఏ వర్గము వారు తమ పరాక్రమమును ఏ కార్యక్షేత్రములో ఉపయోగించారో, ఆ క్షేత్రములో వారు ఆశాతీత

సాఫల్యములను పొందారని చెప్పడానికి ఇతిహాసమే ప్రత్యక్షసాక్ష్యము. అగ్ని ప్రజ్వలననుండి చక్రములను ఆవిష్కరించుటవరకు మొత్తము అతని ప్రథమ కృతి, అది అనేకమైన సాధనములను - వాహనముల వుద్భవించుటను సులభతరము చేసింది. అతను ఒకప్పుడు వ్యవసాయము, పశుపాలన, వస్త్రములు తయారుచేయుట, భవనములు నిర్మించుట, సాగుచేయుట మొదలైనవాటి ఆధారముతో ప్రగతికి క్రొత్త ద్వారములను కనుక్కొనివుంటాడు. భాష మరియు లిపి యొక్క ఆవిష్కారము ఆ సమయములో అత్యంత విప్లవాత్మక మాధ్యమముగా గుర్తించబడి ఉంటుంది. ధర్మము, సమాజము మరియు శాసనముయొక్క నిర్మాణము అనేది వానరుల వలె జీవితమును గడుపుతున్న ఆదిమకాలపు హాస్యాస్పదస్థితిలోవుండే ఆ ప్రజలకు ఎంతో గొప్ప సాఫల్యము. వైజ్ఞానిక ఆవిష్కారములతో అలంకరింపబడిన ప్రపంచమనే కోట ఎప్పుడు పెరుగుతూవుందో అప్పుడు ప్రకృతిపై విజయము సాధించె నగారాలు మ్రోగటం మొదలైనది. ప్రస్తుతము ఎటువంటి అణు-ఆయుధాల కుప్ప ప్రోగయివున్నదంటే అది ఈ విధాతయొక్క సుందర సంరచనయైన పృథ్విని చూస్తువుండగానే ధూళిగా మార్చి ఆకాశములోకి వెదజల్లి ప్రాణుల లేదా వనస్పతుల వర్గమునకు చెందిన అన్ని జాతులను లుప్తముచేయగలదు. ఈవిధంగా మనిషి ఈశ్వరునికి సమర్థుడైన సహాయకుడైనా కావచ్చు మరియు ఘర్షణకు సిద్ధపడే ప్రతిద్వంద్వి కూడా అవవచ్చు. అతనికున్న ఈ శక్తి, చేతన ద్వారా అనుభూతి చెంద గలిగే ఒక ప్రచండ సంకల్పబలమునకు వశవర్తియై అతనిని తోలుబొమ్మవలె ఆడిస్తున్నది. దీని న్యూనాధికముల వలననే మనిషి క్షుద్రుడుగా, గొప్పవాడుగా తయారవుతున్నాడు. అది ఉచ్చస్తరీయమైతే అతను దేవునిగా, నికృష్టత పొందితే దైత్యునిగా ఉద్భవిస్తాడు. దైవీ



శక్తులతో సుసంపన్నమైన వ్యక్తియే సిద్ధపురుషుడిగా లేక దేవమానవుడిగా చెప్పబడతాడు.

బుద్ధి, ప్రతిభ, వ్యవస్థ, సంరచన, పరివర్తన మొదలైన అనేక ప్రయోగములు ఎక్కడెక్కడ జరుగుతాయో అక్కడ వాటి ప్రయోక్తలు, బలవంతులు, మహాబలవంతులుగా చెప్పబడతారు, కానీ సమస్త కళాకౌశలములకు, నిర్మాణములకు, సాఫల్యములకు జన్మదాత్రి సంకల్పశక్తి రూపమైన ప్రాణాగ్ని అనేది మరువకూడదు. అది ఒక చిన్న నిప్పుఅవ్వ స్థాయినుంచి పెరిగిపెరిగి వికరాల దావానల రూపమును ధరించగలదు. ఉత్థానము, పతనము అనేవి దానియొక్క రెండు చిత్రవిచిత్రమైన ఆటవస్తువులు.

అప్పట్లో ఇంగ్లాండు మీద జర్మనీ ద్వారా భయంకరమైన బాంబుదాడులు అనవరతముగా జరుగుతున్నాయి. ఆ సమయములో సాధారణజనము చర్చించుకొంటూ ఇంగ్లాండు పతనము ఏక్షణమైనా జరుగుతుంది అనుకుంటూ వుండేవారు. ఈ ఘోరమైన నిరాశాపూరిత దినములలోకూడ ఆ దేశపు ప్రధానమంత్రి విన్‌స్టన్‌చర్చిల్ అమెరికా, రష్యా ఏమైనాగాని, ఇంగ్లాండు జయించి తీరుతుంది అని ఆత్మవిశ్వాసముతో నిండిన మాటలు చెప్పాడు. ఇంతటి ప్రగాఢమైన ఆత్మవిశ్వాసమును చూచి స్టాలిన్, రూజ్‌వెల్ట్ దిమ్మెరపోయారు. ముగ్గురూ కలసి అడుగులు వేశారు, చూస్తుండగానే అదృష్టము తిరగబడి మిత్రరాజ్యాలు విజయాన్ని వరించాయి.

స్మృతి వలెనే విస్మృతికూడా మానవుని స్వభావములో కలిసిఉంటుంది. కానీ విస్మృతి అనే దుర్గుణము ఎంత స్థాయికి చేరుకున్నదంటే ఏమి చెప్పగలము? అది ఆత్మగౌరవాన్ని, ఓజస్సు, తేజస్సు, వర్చస్సును కూడా మరిపింపజేసింది. ఈనాడుకూడా

ఇటువంటి సమ్మోహన, వ్యామోహములే ఏదో సైతానుద్వారానే వ్యాపించబడినట్టు అనిపిస్తోంది. మనిషి హతాశుడైపోయి తననితాను అభాగ్యునిగా, దీనునిగా, అశక్తునిగా, అసహాయునిగా భావిస్తున్నాడు. అతనికి కనుక తన శక్తిపై తనకు నమ్మముండివుంటే కఠినాతికఠినమైన విఘ్నములను-బాధలను కూడా సవాలుగా స్వీకరంచి ఇప్పటికే ఎంతో ఎత్తుకు ఎదిగివుండేవాడు.

కొన్ని సంవత్సరముల క్రిందటి ఒక వార్త. సైబీరియాలోని మంచుప్రదేశములలో బందీ అయిన ఒక ఖైదీ ఆ దుర్గమమైన క్షేత్రమునుండి పారిపోయాడు. దాదాపు నాలుగువేల మైళ్ళు అతి దుర్గమై, ఆహారముకూడా దొరకని ప్రదేశములను దాటుకుంటూ భారతదేశము చేరుకునే సాహసము  చూపించాడు. ఆ తరువాత అతని దేశమైన పోలండుకు సగౌరవముగా పంపించడము జరిగింది.

**లెక్కలేనన్ని క్రాంతుల యోజనను తయారుచేసినవారు తమ శ్రద్ధను సాకారము చేసుకున్నారు. దీనివెనుక సుయోగమో లేక ఎవరి సహయోగమో వుండివుండవచ్చుకానీ ప్రధానమైనది ప్రచండమైన ఆత్మవిశ్వాసమే. ప్రగతియొక్క మూలము దీనిపైనే ఆధారపడివున్నది. సాధనాలు అనాయాసముగా ఏమీ లభించవు. దానికొరకు తమ ప్రామాణికతను, ప్రఖరతను నిరూపించుకోవాలి. అప్పుడు స్వేచ్ఛగా సహయోగము లభించుటకు ఎటువంటి లోటువుండదు.**

ఆత్మవిస్మృతి అనే ఊబిలోనుండి మానవ సముదాయముయొక్క ఒక వర్గమును బయటకు లాగి ప్రబలమైన ప్రతిభా సంపన్నులుగా చేయాలి. ఈ ప్రయత్నమునకు సర్వోచ్ఛ ప్రాముఖ్యత, ప్రాథమికత నివ్వాలి. ఎందుకంటే ఈరోజులలో అత్యధిక మహత్వపూర్ణ కార్యములు చేయించుటకు దైవీచేతన సమర్థులైనవారి కొరకు ప్రతీక్షించుచున్నది. మానవ స్వభావములో అలవాటులో వ్యాపించియున్న

యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము - 2 51

నారకీయ-దుర్గంధభరిత క్రుళ్ళును తీసివేయడానికి ఎంతటి ప్రచండ యుద్ధ ప్రవృత్తి అవసరమౌతుందంటే  అది తుఫాను వలె వర్షించి, కూలద్రోయబడవలసిన వాటిని పడవేసి  కదిలించి స్థానాంతరణ చేయగలగాలి.

సృజన ఏ స్థాయిలో ఎంత జరగాలంటే కొండల్ని పిండిచేసి వాటి స్థానములో భవ్యభవనాలు నిర్మించగలగాలి. ఇందుకు తపిస్తూవున్న పృథ్విని తన వర్షముతో జలమయము చేయగలిగే మేఘముల వంటి సశక్త సముదాయముల ఆవశ్యకత వున్నది. పృథ్విపై ఆకుపచ్చని గడ్డి మొలచి ఒక పచ్చని మఖమలి తివాచీ వలె పరచుకోవాలి. ఈ యోధులు అగ్రగాములవ్వకపోతే, దరిద్రతను రూపుమాపలేము,అస్వస్థత, అశిక్షలను వదిలించుకోలేము.

సైన్యశిక్షణ, కృషి, విద్యాలయములు, వైద్యాలయాల, కళాకేంద్రముల కొఱత లేదు.కానీ దౌర్భాగ్యమేమిటంటే ప్రతిభా పరిష్కారమునకు పాటుపడే పరిపూర్ణ వ్యవస్థ ఎక్కడా లేదు. ఈ మార్గములో వున్న ఏకైక అవరోధము ఒకటే. అది అంతఃకరణ యొక్క అంతరాళములోపలినుండి ప్రాణచేతన ఉద్భవించుటలేదు; అంతేకాక ఆ లోతుల గహ్వరములలోకి వెళ్ళి కుదిపి, త్రవ్వి  ప్రాణాగ్నిని బయటకు తీయగలిగే ఉపకరణములు లేనే లేవు. ఈ పరిస్థితులలో ఇతర అన్ని క్షేత్రములలో వికానము జరగవచ్చు, కానీ నవయుగముయొక్క మహత్తరమైన ఆవశ్యకతలను చూస్తూ, అవినీతిపై పోరాడుతూ, సృజనను సాకారము చేయగలిగే  ప్రచండ ప్రతిభా సంపన్నులు మాత్రము ఎక్కడా కనిపించరు. అందుకు కావలసిన పురుషార్థమును వీరు తప్ప ఎవరూ ప్రదర్శించలేరు. ఈ రోజులలో ఇటువంటి మహా మానవలను, నిపుణులైన వ్యక్తిత్వములను, ప్రతిభావంతులను వెతికి బయటకు తీసే ప్రక్రియ సంపన్నము కావాలి.

## 7. ప్రతిభ అనగా తేజస్విత అనగా తపశ్చర్య

మనిషి అన్య జీవధారులన్నింటికంటే భిన్నమైనవాడు. అతని శారీరక సంరచన ఎంత అద్భుతమైనదంటే కళాకౌశలముల క్షేత్రములో ఎన్నో చమత్కారములను చూపగలదు. అతని బుద్ధి సంస్థానము చాలా అద్భుతమైనది, దానితో సౌకర్యములు, సాధనములే కాదు, వాటిని మించి వైజ్ఞానికుడిగా ప్రకృతి రహస్యములను ఉద్ఘాటించగలడు. ప్రాణిజగత్తుకు భాగ్యనిర్మాత కాగలిగే హక్కునుకూడ సంపాదించటానికి ప్రయత్నిస్తున్నాడు. విద్య, బుద్ధులకు సంబంధించి అనేకానేక తత్త్వదర్శనములను అతడు తయారు చేశాడు. శాసనము మరియు సమాజము యొక్క సంరచన కూడా అతని తెలివితేటల ప్రతిఫలమే. సాహిత్యము యొక్క అక్షయ భాండారము అతనిచేత సృజించబడినదే. అతనే దేవీదేవతలను సృష్టించాడు. చెప్పదగిన ఇంకో విషయము ఏమంటే సృష్టిని ఈశ్వరుడే తయారుచేసి వుండవచ్చు, కానీ ఈనాడు ఈశ్వరుడు ఏ రూపంలో లోకమానసములలో స్థానము సంపాదించకున్నాడో అది మనిషి చేసిన ప్రతిష్ఠయే. **ఈ దృష్టితో చూస్తే అతను స్రష్టకే స్రష్ట. అవునా? కాదా? గొంతుమ్రింగపడని ఈ సత్యము, తథ్యము ఎంత అద్భుతమైనది. మనిషి నిజంగా గొప్పవాడు. దార్శనికులు అతనిని అందుకే దారితప్పిన దేవత అన్నారు. శాస్త్రకారుల ప్రకారము మనిషి కంటె శ్రేష్టుడు ఈ సృష్టిలో ఎవడు లేడు.**

ఈ విషయము చాలావఱకు సరియైనదనిపిస్తుంది. ఎందుకంటే అవతారములు మొదలు మహామానవులవరకు గల చరిత్రలన్నీ ఒకే విషయమును చెప్తున్నాయి. ఏ ప్రతిపాదనలైతే వేదాంత దర్శనములలో



శివో2హం, సచ్చిదానందోహం, అయమాత్మాబ్రహ్మ, తత్త్వమసి మొదలైన సూక్తుల మాధ్యమముగా అతనిని ఈశ్వరుడు అని నిరూపించాయో మనిషి తనను ఆ స్థాయికి అర్థము చేసుకుని, వికసింపజేసుకుని, ఎదగగలడు. ఈశ్వరుని యొక్క రాజకుమారులుగా, ప్రతినిధులుగా అనేక మూర్ధన్యులు అనేక సార్లు చెప్పుకున్నారు. ఏసుకు ఈశ్వరుని పుత్రునిగా మాన్యత లభించినది.

ఈ పృథ్వి అనాదికాలమునుండి ఎగుడు-దిగుడుగా, గొయ్యిలతో కందకాలతో నిండి లెక్కలేనన్ని జీవజంతువులకు క్రీడాస్థలిగా వుండివుంటుంది. దానిని ఈరోజు వున్న స్థితికి తీసుకురావడానికి, స్వర్గాదపి గరీయసిగా తయారుచేయడానికి ప్రధానపాత్ర వహించినది మనిషియొక్క కళాత్మకతయే. అడవిమనిషి లేదా నర-వానరము అనే ఆదిమస్థితినుండి పైకి ఎదిగి తననుతాను ఏవిధంగా మలచుకున్నాడో చూస్తుంటే ఎంతో ఆశ్చర్యము కలుగుతుంది. ప్రకృతిలోని రహస్యమయశక్తులు ఎప్పుడో అవిజ్ఞాతముగా వుండివుండవచ్చు. కానీ ఈనాడు అతడు పరమాణువులో ప్రకటితమయ్యే శక్తి స్రోతములను హస్తగతము చేసుకొనుట మొదలు అంతరిక్షముపై సామ్రాజ్యము స్థాపించుటవరకు అన్నిటికి సమర్థుడైనాడు. నిజంగా మానవుడు ఈ బ్రహ్మాండములో ఉన్న గొప్పవాటికంటే అత్యంత గొప్పవాడు.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే దారితప్పడమనేది అతనిని ఎంత దారుణంగా పట్టుకున్నదంటే అతను తన అస్తిత్వమును, మహత్తును మరియు స్థాయికి సంబంధించి ఎంత దిగ్భ్రాంతుడు అయినాడంటే తప్పుడు దారి యొక్క చివరి హద్దుకు చేరిపోయాడని చెప్పవచ్చు.

అతని తప్పటడుగుల మొదటి మెట్టు ఎక్కడ మొదలైనది అంటే తన శక్తిని, మహత్తును, గరిమను, సామర్థ్యమును గురించి విస్మృతి

XXXXXXXXXXXXXXX

చెంది మత్తులోపడుతున్నాడు. ఆకారములో-ప్రకృతిలో తన భిన్నత్వాలని చూస్తాడు, కానీ చేతనాక్షేత్రములో పశుస్థాయికి చెందిన ప్రాణులకంటే ఎంతో విశిష్టత కలవాడు అని ఆలోచించడు. ప్రాణులు పొట్టనింపుకోవడానికో, ప్రజననానికి చెందిన కుతూహలముతో ఆ రసాస్వాదనకొరకు జీవిస్తారు. వాటికి మర్యాదలపట్ల శ్రద్ధ వుండదు, వర్జనీయాలనుండి దూరంగా వుండాలనే తపనా వుండదు. బంధనాలు, ఉత్తేజపరచే పరిస్థితులు, అవరోధాలవలన నియంత్రితమైనప్పుడె అనుచితంగా ప్రవర్తించవు. స్వేచ్ఛాస్థితిలో, సామర్థ్యమును కలిగివుండి కూడా మర్యాదలను పాటించుటయందు వాటికి ఏ ఉత్సాహము వుండదు. ఆవశ్యకతలు, మనోవాంఛలే వాటి ప్రేరణకు మూలములు. మానవుని భావనలు, ధారణకూడా ఈవిధంగానే వుంటే, అతనిని నరపశువుకంటే ఎక్కువగా చెప్పలేము. ఎవరు లోభము, మోహ, అహంకారముల, లిప్స-లాలసలనే తన లక్ష్యములుగా చేసుకున్నారో వారు ఇక ఉచితానుచితముల తేడాను ఎలా తెలుసుకుంటారు? సంకీర్ణస్వార్థపరత యొక్క భవబంధనములనుండి విముక్తిపొందుట అతనికెలా సాధ్యమవుతుంది? ఎవరిని సంపన్నతపట్ల తృష్ణ, గొప్పవాడుగా చెప్పబడాలనే మహత్వాకాంక్షలు పట్టి పీడిస్తాయో, అతనికి విచారశీలత, వివేకశీలత అనే స్వేచ్ఛాకాశములో రెక్కలల్లార్చుతు విహరించుట ఎలా సాధ్య పడుతుంది? సాధారణమానవుడు సాధనాలు మరియు సామర్థ్యాల దృష్టిలో ఎలా కనిపించినా అతనిపై ఆదర్శములయొక్క తరంగాలు ఏ ప్రభావమును చూపలేవు. ఉత్కృష్టతయొక్క గరిమను పొందాలనే కోరిక అసలు జనించదు. ఏ పుణ్య పరమార్థముల కొరకు స్రష్ట మానీవీయ ఉత్కృష్టతను, దేవోపమ స్థాయిలో విశేషంగా సృష్టించాడో అటువంటి ప్రసంగములుకూడా ఒకవిధంగా అతనినితాకనుకూడా తాకలేవు. దానినుండి పూర్తిగా



వేరయినతరువాత వ్యక్తి క్షుద్ర క్రిమి-కీటకలము వలె జీవించే స్థాయికి దిగజారి ఆ శ్రేణిలోనే గణింపబడుతాడు. ఎంత గొప్పపదవిలో, అధికారములో వున్నా సంపన్నుడైనా, కుశలుడైనా, మరియు గొప్ప విభూతివంతుడిగా చెప్పబడినాకూడా ఈ సౌకర్యములన్నీ కేవలము శారీరక విలాసము కొరకు  అలంకరించుకుని మిడిసిపడుటకే వుపయోగపడతాయి. ఇవి ఎంత ఎక్కువగా ఉన్నా దేని ఆధారముపై అతడు గౌరవింపబడతాడో ఆ అంతఃచేతనకు ఎటువంటి సంతోషముకానీ, ఉల్లాసముగానీ కలుగదు. దీని యొక్క లేమి వలననే ప్రతిక్షణము ఉద్విగ్నత, విసుగు ఆవరిస్తోంది.

చాలామంది ధర్మసంబంధ చర్చలుచేస్తూ వింటూ వుంటారు. కానీ అదంతా నిరర్ధకమే. లోకులు పూజా-పారాయణములు చేస్తూ తీర్థపర్యటనలు, భజనలు-ప్రదర్శనాలు వంటి  సాధారణ విషయములపట్ల మనసు లగ్నంచేసుకుంటూ తమను తాము ధర్మసంస్థాపకులుగా భావిస్తువుంటారు. కానీ వాస్తవము అది కాదు. కర్మకాండలయొక్క ఒకే ఒక్క ఆవశ్యకత ఏమిటంటే చింతన మరియు వ్యవహారములలో సౌజన్యము మేళవించగలగాలి. వాస్తవముగా ఎవరికి ధర్మముపట్ల రుచి వుంటుందో వారు దేవోపమ స్థాయికి చెందిన జీవితాన్ని గడుపుతారు. వారి అంతరంగము, బహిరంగములన్నింటిలో ప్రామాణికత, ప్రఖరత నిండివుండాలి. అనౌచిత్యమును ఆశ్రయించిన వ్యక్తులు సౌకర్యములను సాధనములను సంగ్రహించి తమ భజనపరులు, ముఖస్తుతిపరులద్వారా ప్రశంసలు పొందుతూ తిరుగుతూ వుంటారు. కానీ వారిలో లోతుకానీ స్థిరత్వముగాని వుండదు. దుమ్ముతో తయారయిన మేఘములు ఎంత దట్టంగా వున్నప్పటికీ ఒక్క గాలివాటానికే చెల్లాచెదరైపోతాయి. నీటి బుడగలవలె కొద్ది క్షణాలలోనే అస్తిత్వమును పోగొట్టుకుంటారు.

ప్రతిభయొక్క విస్తృతభాండారముతో మనిషియొక్క అంతర్‌సత్తా నిండివున్నప్పటికి అవి పైకి ఉప్పొంగి ప్రకటితమయ్యే వీలు లభించుటలేదు. కారణము అతను స్వేచ్ఛగా అనేక కషాయ కల్మషాల ఒత్తిడిలను తన ఆత్మసత్తా మీద కప్పుకున్నాడు. కఱ్ఱముక్క నీటిపై తేలుతూఉండాలి, కానీ దానిపై పెద్ద బండఱాళ్ళను కట్టితే? దాని స్వాభావికగుణమైన తేలుటఅనేది అణిచివేయబడుతుంది. విభూతివంతుడైనప్పటికీ మనిషి నికృష్టతలనే ఱాతిబండలను మోస్తూ వుండటము వల్ల తేలుట మరియు తన వాస్తవికస్థితిని, వాస్తవ స్వరూపాన్ని చూపించే స్థితిలో వుండడు.

ప్రసుప్తప్రతిభను జాగృతపరచుకొనే అవకాశము లభించుటకు ఆవశ్యకమైన శ్రేష్టచింతనతో అంతరాళమును రక్షించుకోవాలి మరియు భ్రష్టాచారముల నుండి శరీరమును రక్షించుకొనే ప్రయత్నము చేయాలి. అవాంఛనీయ మహత్త్వాకాంక్షలనే ఇనుపసంకెళ్ళనుండి మన కాళ్ళు, చేతులు ఎప్పుడు విడుదల అవుతాయో అప్పుడే ఇది సాధ్యపడుతుంది. లోకులందరూ ధనాఢ్యులుగా వుండాలనే ఆశపడతారు. ఎందుకంటే విలాసములకు సంబంధించిన విస్తృతమైన సాధనాలు సమకూర్చుకోవచ్చు. అభావగ్రస్తులైన తమ వంశపరంపరలో తాము చాలా గొప్పగా వున్నామని నిరూపించుకొని మీసాలు మెలివేయవచ్చు. ఇంత చిన్న పరిధిలోనే ఎవరి అంతరాళము కేంద్రీకృతమై వుంటుందో వారు మానవీయగరిమను నలుదిశల వ్యాపింపజేసేమహత్తర కార్యములు చేయుటకు సుముఖత వ్యక్తము చేయరు. గుంజకు కట్టిన తాడు విప్పకుండా నావకు ఎన్ని తెడ్లు వేసినా ముందుకు కదలదు. సంకీర్ణ స్వార్థపరతకు దాసుడైన వ్యక్తి ఆదర్శములను పాటించలేడు. ఉత్కృష్టమైనవేమీ చేయలేడు. అలంకారములతో కురూపియైన వేశ్యకూడా తాను చాలా



అందమైనదానిని అనే భ్రమను కలిగించవచ్చు.

ప్రతిభను బయటనుండి కూడకొట్టుకొని తీసుకొని రాలేము, అది ఎల్లప్పుడూ లోపలినుండే ఉప్పొంగుతుంది. ఇందుకోసము ఉత్కృష్టతా మార్గములో అడ్డుపడుతున్న కొండలవంటి భయంకర అవరోధములను తొలగించుట అనివార్యము. ఇందుకు నిరంతర స్మరణలో ఉండవలసిన తథ్యము, ఏమిటంటే సగటు నాగరికుల స్థాయిలోనే జీవన నిర్వహణ ఉండాలి లేకపోతే తృష్ణలు, వాసన, ఆకాంక్షలు ఎంతగా ఆవరించుకుంటాయంటే తన సామర్థ్యముతో పోలిస్తే చేయగలిగే పరమార్థములో అతి కొంచము కూడా సాధించలేడు. ఈ గోతులు ఎంత లోతుగా, వెడల్పుగా వుంటాయంటే చిన్న జీవితముయొక్క మొత్తము సాధనాలను, శ్రమను, కౌశలమును పూర్తిగా ఉపయోగించినా నిండవు. మరి ఉత్కృష్టతతో అత్యంత దట్టముగా జోడించబడిన ప్రతిభా పరిష్కారముయొక్క పుణ్యప్రయోజనము సంతోషపడేటంత స్థాయిలో సాధించుట ఎలా సంభవమౌతుంది?

లాలనలతో కూడిన భౌతికమైన మహత్త్వాకాంక్షలను వదుల్చుకోలేకపోతే ఆత్మకళ్యాణ, లోకళ్యాణ దిశ వైపు చెప్పుకోదగిన అడుగులు వేయుటకు అవసరమైన సమయము, శ్రమ, సాధనాలు ఎవరూ మిగుల్చుకోలేరు. సాధువులను, బ్రాహ్మణులను-భూసురులని, పృథ్విపై దేవతలు అనే ఉపమానములతో గౌరవిస్తారు. అది ఎందుకంటే వారు సంయమము, అపరిగ్రహము, సంతోషముల మార్గమును ఎంచుకున్నారు. వ్యక్తిగత గొప్పలమీద ఎవరికి ఎంత అభిరుచి వుంటుందో, దానికి తగ్గట్లు వారు తమని తాము తీరిక లేని వారిగా, అభావగ్రస్తులుగా అనుభవము చెందుతారు. ఎల్లవేళలా నేను సమస్యలతోనే సతమతమౌతున్నాను అని చెప్తూ వుంటారు. అయినా వాస్తవమైన సమస్యలు మనిషికి ఎన్ని వుంటాయి కనుక. వాటిని

కనుక వ్యావహారికబుద్ధితో, తెలివితేటలతో పరిష్కరిస్తే ఎంత సులభముగా తేలిపోతాయంటే నిజానికి అవి సమస్యలే కావు. భ్రాంతుల మూలముగా అవి పెద్దవిగా భారముగా అనిపిస్తాయి.

సంయమము, నియమములకు ఎన్నో అనుబంధాలు వున్నాయి. అందులో ఆహార-విహారాదులయొక్క శుద్ధి, సజ్జనత, సద్భావన, శ్రమశీలత, మితవ్యయము, స్వచ్ఛత, సహకారిత, అనుశాసనము పట్ల యిష్టము మొదలైనవి ముఖ్యమైనవి. దీనికి వ్యతిరేకముగా అనేక దోషములున్నాయి. అవి అసంయమము, తిండిపోతుదనము, నిర్లక్ష్యము, సోమరితనము, క్రూరత్వము, స్వేచ్ఛాచారిత, అపవ్యయము, వ్యసనములు మొదలైనవి. ఇవి ప్రగతికి ఆటంకములు అవుతాయి. ఇవి చూడటానికి, వినటానికే చాలా భరింపరానివిగా వుంటాయి. కానీ వాస్తవానికి ఇవి సంకీర్ణ స్వార్థపరత మరియు స్వేచ్ఛాచారముల సంతానమే. వీటిలో ఒక్కొక్కదాన్ని లెక్కించి తూచటమనేది, నిషేధించడము అనేది కప్పలను తూచడములాంటిది. దుప్పట్లను ఎండలో వేస్తే నల్లులు, వాని గ్రుడ్లు అన్నీ చచ్చిపోతాయి. **ఇదేవిధముగా దృష్టికోణమును ఉదాత్తముగా మార్చుకుంటే వ్యక్తికి తన స్వరూపము, లక్ష్యము, కర్తవ్యము మూడు అవగతమౌతాయి.** సామాన్య వస్తువులను కూడా భూత ప్రేత పిశాచాల వలె భయంకరముగా చూపే అంధకారము ఈ ప్రకాశము లభించినప్పుడు దూరమైపోతుంది.

దృష్టికోణములో విశాలత చోటుచేసుకున్నప్పుడు పరమార్థమే పరమ స్వార్థముగా కనిపిస్తుంది. దీనితో సమానమైన లాభము ఏ వృత్తిలోనూ వుండదు. ఈ సత్యమును ఇతిహాసములో ప్రసిద్ధిపొందిన మహామానవులు మొదలు ఈ కాలానికి చెందిన శ్రద్ధాళువులైన వ్యక్తులపై కురుస్తున్న సద్భావనలను చూస్తే సహజంగానే బోధపడుతుంది. వ్యక్తిగత లాభము గురించి ఆలోచించేవారు, దూరదృష్టి వున్నవారైతే, వారు తమ



సామర్థ్యమును పరమార్థ ప్రయోజనములలో వెచ్చించినట్లయితే ఇంకా ఎన్నోరెట్లు అధికంగా లాభం పొంద వచ్చు అని తెలుస్తుంది. వారు సమాజమనే పొలములో పుణ్యపరమార్థములనే బీజములను వెదజల్లి ఆ పంటను తమ కొరకుకాక, సమాజముకొరకు కోసి విశ్వవసుధను లాభాన్వితము చేస్తారు. ఇదే ప్రతిభకు చిహ్నము.

తేజస్వితనే ప్రతిభ అని పిలుస్తారు. ఇది ముఖముయొక్క సౌందర్యము, చతురత కాదు. మనోబలము మీద ఆధారపడిన ఊర్జ. గాంధీజీ 92 పౌండ్ల బరువుతో 5 అడుగుల 2 అంగుళాలే వుండేవారు. రంగుచూస్తే నలుపు మరియు కురూపి కూడాను. కానీ ఆయన తేజస్సు ఎటువంటిదంటే జనసామాన్యము మొదలు వరిష్ఠులైన మూర్ధన్యులవరకు అందరూ ఆయన ఆదేశములు శిరోధార్యముగా భావించేవారు. అంతవరకూ ఎందుకు. విశాల సామ్రాజ్యానికి అధిపతులైన ఆంగ్లేయులే ఆయన వల్ల ప్రభావితులై మూటముల్లె సర్దుకుని వెళ్ళిపోయారు. ఈ తేజస్సు స్వయముగా వ్యక్తిని మరియు సామూహిక జీవనమునందలి ప్రతివర్గమును మెరిపింపజేస్తుంది. అతనిని ప్రఖరతతో కూడిన ఊర్జతో జాజ్వల్యమానము చేస్తుంది.

తేజస్విత అనేది తపశ్చర్య వల్ల వచ్చే లాభము. అది నిజజీవితములో సంయమసాధనలు, సామాజిక జీవితములో పరమార్థపరాయణతల ఫలముగా ఉద్భవిస్తుంది. సంయమము అంటే అనుశాసనముయొక్క, ఆత్మనియంత్రణ యొక్క కఠోరమైన అనుసరణ. ఇందుకొఱకు మనిషి తృష్ణ, వాసన, అహంకారము అనే మూడు నాగపాశములనుండి విముక్తుడవ్వాలి. సాదారణ జీవన సరళి, ఉన్నత ఆలోచనల యొక్క బ్రాహ్మణోచిత సామాన్య నాగరికుని స్థాయిలో జీవించవలసి వుంటుంది. ఈవిధంగా జీవించినవారే పరమార్థమును సాధిస్తారు మరియు యోగులలో కనిపించే సిద్ధులు, శక్తులు,

విభూతులు అంతరాళంలో వుద్భవించి అఖిల అంతరిక్షమునుండి అభివర్షణ జరుగుతుంది. దైవీ అనుగ్రహము లేదా వరదానమని దానినే అంటారు.

కర్మకాండపరముగా దీనికి అనేక సాధానా విధానాలు వున్నాయి. అన్నింటికంటే సులభమైనది నిత్యజీవితమును చాలా సాదాసీదాగా ఉంచుకుంటే అత్యంత తక్కువ శ్రమతో, తక్కువ సమయము వినియోగించి జీవించుట సంభవమౌతుంది. అలా చేస్తే ఎంత శ్రమ, సమయము, సాధానాలు మిగులుతాయంటే ఆ సమయములో పరమార్ధ ప్రయోజనములో నిమగ్నులై పరబ్రహ్మతో ఏకాత్మతను పొందే రసాస్వాదన చేయవచ్చు. దేవతాసమానమైన జీవితము యొక్క ఆనందము పొందవచ్చు.

ఏ ప్రయోజనము కొఱకు ఏ అవసరము పొందుటకు ఎటువంటి సంయమనమును చేసుకోవాలి? ఇటువంటి నిర్ణయములను వ్యక్తి యొక్క విశేష పరిస్థితులను మరియు మనఃస్థితులను చూచి తీసుకోవలసి వుంటుంది. ఎవరి జీవితములో ఏ పక్షము బలంగా, నియంత్రణ లేనిదో చూచుకుని సర్కసులో జంతువులకు శిక్షణ ఇచ్చే బలచాతుర్యాన్ని ప్రదర్శించి కళాకౌశలమును చూపించేందుకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. శరీరము మరియు మనస్సు రెండింటియందు సౌజన్యమును అభ్యసించవలసివుంటుంది. సంయమయోగమంటే ఇదే. ఈ మాత్రమైనా చేయగలిగినవారే పుణ్యపరమార్ధములను ఆర్జించుటకు అధికారులవుతారు. అసంయమిత ఉద్ధత ఆచరణ చేసే వ్యక్తి, బురదతో బురద కడిగిన విధముగా ఏమైనా సాధించగలడా? సౌజన్యము, పరమార్ధ పరాయణత రెండూ కలిసి తపశ్చర్యగా మారుతుంది మరియు దాని ఆధారముగానే ప్రతిభ యొక్క ఊర్జ తన ప్రచండతను చూపిస్తుంది.



## 8. ప్రతిభా సంవర్ధన కొఱకు నిర్ధారింపబడిన విజ్ఞాన సమ్మతమైన ప్రయోగ ఉపచారములు

ప్రతిభాపరిష్కారము కొఱకు వ్యక్తి యొక్క ప్రామాణికత మరియు ప్రఖరతలనే ఇరు పక్షములను బలోపేతము చేయవలసి వుంటుంది. భావములతో నిండిన, వుత్సాహముతో నిండిన, ఏకాగ్రతతో కూడిన తన్మయతను వృద్ధిపరచాలి. దానితో పాటు శ్రమను కూడా అవిచ్ఛిన్నముగా జోడించి తత్పరతను లేదా శ్రమశీలతను కార్యాన్వితము చేయాలి. సంకీర్ణ స్వార్ధపరతను దాటి ముందుకు పోవాలి, అప్పుడే సాదాజీవనము, ఉన్నత ఆలోచనలు అనే రీతి నీతిని పాటించుట వల్ల మిగిలిన సమయము, శ్రమ మరియు సాధనములను సత్ప్రవృద్ధి సంవర్ధనలో, లోకసేవలో నిమగ్నము చేయాలి. ఉచ్చస్తరీయ ప్రతిభా సంవర్ధన ఈ విధముగానే జరుగుతుంది.

**ఇక్కడ ప్రతిభ యొక్క ఆశయము ఎల్లప్పుడు ఆదర్శోన్ముఖ బుద్ధి మరియు భావనల యొక్క సమన్వయ వికాసమని గుర్తుండాలి. ఇటువంటి ప్రతిభాసంపన్నులే తమని తాము ప్రేరణాత్మక ఆదర్శముల పుంజములుగా, ప్రతీకలుగా తీర్చిదిద్దుకొని ఇతరులను కూడా అలానే తీర్చిదిద్దుతారు. ఇటువంటి ప్రతిభల వికాసమునకు సంబంధించిన విధి విధానములు గురించిన చర్చ జరుగుతోంది.**

పిల్లలకు పలకలపై వ్రాయడం, పూసల ద్వారా లెక్కలు నేర్పించడము, మూడు చక్రాల బండి ఆధారముగా నడక నేర్పడము వలె కొన్ని అభ్యాసముల ద్వారా జనసామాన్యమును ప్రతిభాసముపార్జన దిశలో అగ్రసరులను చేయగలమా? చేయగలము అని సమాధానము.

జనసాధారణము యొక్క శారీరిక అంగ, అవయవముల పరిపుష్టి కొఱకు అన్ని రకాల వ్యవస్థలు వున్నాయి. అభ్యాసములను పాటించి, శారీరిక అంగములను సశక్తముగా చేయుటకు వ్యాయామములు, ఆహారములో పరివర్తన అవసరమౌతుంది. అలాగే కొన్ని సాధనాపద్ధతులు ప్రతిభా పరిష్కారము విషయములో కూడా నిర్ధారింపబడి ఉన్నాయి. వీటిని ఉపయోగించి చాలావరకు సఫలీకృతులు కావచ్చు. బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్ ద్వారా ఉపయోగించె కొన్ని విధానాలు మరియు ఇప్పుడు ప్రచారములో ఉండి తర్వాత కొంచెం మార్పు చెందవచ్చు అనేవి దిగువ ఇవ్వబడుతున్నాయి.

**1. స్వసంకేతము (ఆటోసజెషన్) :-** శాంత వాతావరణములో స్థిరశరీరము మరియు ఏకాగ్రమనస్సుతో కూర్చోవాలి. తన మస్తిష్కకేంద్రము నుండి వెలువడిన ప్రాణవిద్యుత్తు పూర్తి శరీరములోని అంగములు, అవయవములలో చాలా ఎక్కువగా నిండుతున్నదనే భావన చేయాలి. అక్కడ శిధిలత స్థానము సమర్థ సక్రియత తీసుకుంటున్నదని భావించాలి. దాని ఆధారముగా ప్రతి అవయవము పుష్టిని పొందుతోంది. ఇంద్రియముల సామర్థ్యము పెరుగుతోంది. ముఖముపై తేజస్సు పెరుగుతోంది అని భావించాలి. భౌద్ధికస్థాయిలో ఎలాంటి మార్పు జరుగుతున్నదంటే ప్రతిభాసంవర్ధన అనేది ఎవరికి వారికే కాదు అందరికీ అనుభవమౌతుంది.

వాస్తవానికి స్వసంకేతములలో మానసిక కాయకల్ప రహస్యము దాగివుంది. శృతిననుసరించి 'యోయచ్ఛ్రద్ధ స ఏవసః' అనగా ఎవరు దేని గురించి ఆలోచించి, దేనిగురించి భావన చేస్తారో వారు అలాగే తయారవుతారు. విధేయాత్మక చింతన, మహాపురుషుల యొక్క గుణములు మనలో ఓతప్రోతమవుతున్న భావనలతో, సజాతీయ ఆలోచనలు ఆకర్షించబడి వాంఛిత విద్యుత్తు ప్రవాహములకు



జన్మనిస్తుంది.

మనోవైజ్ఞానికులు దీని ఆధారముగానే వ్యక్తిత్వములో, ఆలోచనా ప్రవాహములో పరివర్తన తీసుకురాగలమని చెప్తారు. వారి ప్రకారము **పృధ్వికి నలువైపులా ఆయనోస్ఫియర్ వుంది, అదేవిధముగా మానవీయ మస్తిష్కమునకు నలువైపులా ఒక అయిడియోస్ఫియర్ వుంటుంది.** మానవుని చింతన ఎలా వుంటుందో అది కూడా అలానే వుంటుంది. క్షణకాలములోనే ఆలోచనలు మారిపోయి మళ్ళీ పాత విధానములోకి మారవచ్చు. ఈ ఆలోచనాప్రవాహమును ఆదర్శోన్ముఖ, శ్రేష్టతలవైపు గతిశీలమైతే వ్యక్తి యొక్క ముఖమండలము మెరుస్తూ వుంటుంది మరియు ఇతరులను ఆకర్షిస్తూవుంటుంది. ఇటువంటి వ్యక్తియొక్క మాట ప్రభావమును కలిగివుంటుంది. అవి అన్యులలో కూడా పరివర్తనను తీసుకువస్తాయి. ఒక విధముగా చూస్తే మన అభామండలమును (ఆరా) ఒక సశక్త విద్యుదయస్కాంతముగా మార్చవచ్చు. మనోవైజ్ఞానికులు చెప్పేదేమిటంటే "థింక్ అండ్ గ్రో రిచ్" లేదా " అడాప్ట్ పాజిటివ్ ప్రిన్సిపుల్ టుడే". అసలు ఆశయమేమిటంటే ఏది ఆలోచిస్తారో అది విధేయాత్మకముగా ఆలోచించండి. ఈక్షణమే ఆలోచించండి. అప్పుడే శ్రేష్టుడివిగా మారగలవు. మహామానవులందరూ ఈ సంకేతము ఆధారముగానే మహాత్ములయినారు. గాంధీజీ, హరిశ్చంద్ర నాటకమును చూసి సత్యమార్గమును జీవితములో ఆచరించి పరిణామము చూడాలి అనే స్వసంకేతము ఇచ్చుకున్నాడు. ఆయన ప్రగతియందు, చింతనయందు దీని ప్రభావము అందరికి తెలిసినదే కదా !

బ్రహ్మవర్చస్సు యొక్క పరిశోధనా ప్రక్రియలో ఆడియో, వీడియో క్యాసెట్‌లను ఉపయోగించుకొని, ఇయుర్‌ఫోన్స్ ద్వారా సంకేతాలివ్వబడతాయి. కొంత విరామము తరువాత మళ్ళీ అన్ని

ప్రసంగములపై ఆలోచనలు చేయమని చెప్పబడుతుంది. దీని వల్ల ప్రభావవంతమైన విద్యుత్ప్రవాహము జనిస్తుంది. దీని ప్రత్యక్షపరిణామము జి.యస్. ఆర్ బయోఫీడ్ బ్యాంక్ రూపములో చూడవచ్చు. దీని ద్వారా వ్యక్తి తన ఆలోచనల ద్వారా చర్మ నిరోధక శక్తి పెరగడము, తగ్గడము స్వయముగా చూడవచ్చు. ఇదేవిధముగా శ్వాస, హృదయస్పందన, రక్తపోటు మొదలైనవన్నీ స్వసంకేతముల ద్వారా ప్రభావితమౌతాయి. విపశ్యనాధ్యానము మరియు జైనధ్యాన పద్ధతి ఇటువంటి స్వసంకేతముల పద్ధతిపైనే ఆధారపడివుంటాయి. సరైన పద్ధతి ఆచరిస్తే ప్రతిభా పరివర్తనలో కోరిన మార్పు తప్పక లభిస్తుంది.

**2. దర్పణసాధన :-** ఇది ముఖ్యముగా ఆత్మావలోకనము, ఆత్మపరిష్కారము యొక్క సాధన. పెద్ద దర్పణమును ముందు కూర్చోవాలి. సుఖాసనములో నేలపై కానీ కుర్చీమీద కానీ కూర్చోవాలి. శరీరము పై అతి తక్కువ బట్టలుండాలి. ప్రతి భాగముపై విశ్వాసముతో కూడిన దృష్టితో అవలోకించాలి. ముందు తన గురించి తాను ఆలోచించుకోవాలి. తరువాత తనలోని దోషములు, దుర్గుణముల నుండి విముక్తుడవుతున్నట్లు భావించాలి. ఆ పరమశక్తిమంతుడు చాలా దయాళువు. ఇక జరిగిన తప్పులను వదలి లోపలి సంరచన మొత్తము ప్రాణవిద్యుత్‌తో నిండుతున్న అనుభూతి చెందాలి మరియు దాని తేజస్సుచేత చర్మము పైభాగము మెరుస్తూ ప్రతి అంగములో వెలుగు బహిర్గతమవుతున్నట్లు భావించాలి. ముందు ఏదైతే నిస్తేజముతో క్షీణించి దుర్బల శరీరసత్తాగా వుందో అది మారిపోయి శరీరములోని రోమరోమము విద్యుత్తుశక్తితో ఆవరించుకుంటున్నది. వికాసక్రమము పైకి వుబికివస్తుంది. ప్రతిభా పరివర్ధనము యొక్క లక్షణములు నిశ్చిత



రూపములో కనిపించుచున్నవి మరియు ఎదురుగా ఉన్న ఆకృతిలో తమ అస్థిత్వము పూర్తిగా విలీనమౌతున్నది. ఈ ధ్యానప్రక్రియని లయయోగధ్యానముగా చెప్తాము, ఇది వ్యక్తి భావముల కాయకల్పము చేసి మార్చివేయగలదు.

**3. రంగుల వాతావరణము యొక్క ధ్యానము :-** ప్రతి రంగుయందు సూర్యకిరణములయొక్క తమతమ స్థాయికి చెందిన రసాయనములు, ధాతుతత్వములు మరియు విద్యుత్ప్రవాహము లుంటాయి. అవి శరీరముపై, మనస్సుపై తమ విశిష్ట ప్రభావమును చూపిస్తాయి. ఇందులో దేని నిష్పత్తి తగ్గినా, పెరిగినా లేక వికృతులతో అసంతులితమైనా అప్పుడు అనేక రోగములు బాధలు పెరుగుతాయి. అందువల్ల రంగులను పారదర్శక గాజుల ద్వారా లేక విభిన్న రంగుగల బల్బుల ద్వారా బాధించుచున్న అవయవములపై విశేషముగా వాటి సక్రియతను పెంచడానికి రంగుల కిరణములను ఆవశ్యకతానుసారము నిర్ధారిత అవధి వరకు ప్రసరింప జేస్తారు. ప్రతిభా పెరుగుదల కొరకు అవసరమైన విశిష్ట రంగులపై ధ్యానము చేయబడుతుంది. కొంతసేపు ఏడు రంగుల క్రమములో నిర్ధారించిన రంగులు (వంకాయ, ఆకాశనీలము, ఆకుపచ్చ, పసుపుపచ్చ, నారంగీ, ఎరుపు) ఫ్లాషెస్ స్ట్రో బయోస్కోప్ యంత్రము ద్వారా వెరిపిస్తారు మరియు కళ్ళకుపెట్టుకున్న అద్దాల ద్వారా ఆ వర్ణవిశేషతలు నిరంతరము కనపడుతూవుంటాయి. దీని ప్రభావము మస్తిష్కమందలి సూక్ష్మకేంద్రములపై, చక్రసంస్థానములపై పడుతుంది. నియమితరూపములో కొంతసేపు చేసే ధ్యానమును కనుక క్రమముగా ఆచరిస్తే ఆశించిన పరివర్తనా ప్రక్రియ మొదలవుతుంది. ధ్యానము ఎలా చేయాలంటే ప్రపంచమందు అంతా ఒకే రంగు యొక్క శక్తి

వున్నది, అది మన శరీరములో ప్రవేశించి అభీష్ట విశేషతలు గల ఊర్జను శరీరములో ప్రవహింపచేస్తున్నది. ఈ ధ్యానము 5 నుండి 10 నిమిషముల వరకు చెయ్యాలి. విశేషజ్ఞుల ద్వారా భిన్నభిన్న ప్రకృతులకు చెందిన సాధకుల కొఱకు భిన్నభిన్న వర్ణములను నిర్ధారించి ఆ ప్రక్రియ ప్రారంభించబడుతుంది.

**4. ప్రాణాకర్షణ ప్రాణాయామము :-** ఈ సమస్త బ్రహ్మాండము నందు ప్రాణశక్తి నిండివున్నది. అందులోనుండి సాధారణముగా ప్రాణికి తన జీవననిర్వహహణకు ఎవరికి ఎంత అవసరమో అంతే లభిస్తుంది. ఎక్కువ లాక్కోవలసిన అవసరము ఎప్పుడు వస్తుందో అప్పుడే తీసుకోవాలి. శరీరగత ప్రాణము మరియు సమావిష్టమైన మహాప్రాణము యొక్క సంయోగముతో శరీరములోని ప్రాణము నవీనీకరింపబడుటయే కాక ప్రాణధారణను వుపయోగించే శక్తి పెరుగుతుంది. చేతనాజగత్తులో ప్రాణ శక్తి విద్యుత్తుఊర్జ రూపములో, 'నెగిటివ్అయాన్స్' రూపములో విద్యమానమైవుంటుంది. దీని లోటు వల్ల వ్యక్తి అనారోగ్యముతో నిస్తేజముగా, ప్రాణహీనుడుగా తయారవుతాడు. అతని ప్రభావోత్పాదకతను తగ్గిస్తుంది. అవసరమైన మేరకు వుంటే అతడిని రోగము లేకుండా తేజస్సుతో, ప్రాణసంపన్నునిగా మార్చి, అతని ప్రభావసామర్ధ్యంలో అభివర్ధన జరుగుతుంది.

ప్రతిభాపరివర్ధనకు ప్రాణాకర్షణ ప్రాణాయామము ఒక విధానము. స్థిరముగా, సుఖాసనములో, వెన్నెముక నిటారుగా వుంచుకొని, రెండు చేతులని ఒడిలో పెట్టుకొని కూర్చోవాలి. దట్టమైన మేఘరూప ప్రాణస్పందనలు మన చుట్టూ కమ్ముకొని మన వైపుకు తరలి వస్తున్నాయి, మనము వాటి మధ్య నిశ్చింతగా ప్రసన్న ముద్రతో



కూర్చునివున్నాము. రెండు ముక్కు రంధ్రాల ద్వారా నెమ్మదిగా శ్వాస పీలుస్తూ దానితో పాటే ప్రఖర ప్రాణము కూడా శరీరములోకి ప్రవేశిస్తోంది అని భావించాలి. నెమ్మదిగా శ్వాసను బయటకు వదులుతూ మనలోని అవాంఛనీయతలు, లోపల వున్న దౌర్బల్యములు శ్వాసతో పాటు బయటకు విడువబడుతున్నట్టుగా భావించాలి. మళ్ళీ అవి తిరిగిరానేరావు. ఈ ప్రాణాయామము ప్రారంభములో 5 నుండి పది నిమిషాలు చేస్తే చాలు. క్రమముగా సమయము పెంచుకోవాలి. శోధసంస్థానము ద్వారా ప్రాణధారణ సామర్ధ్యము ఎంత పెరిగింది, రక్తము లోని దోషతత్వములు ఎంత బయటికి వెళ్ళాయి, రక్తములో ఆక్సిజన్ శాతము ఎంత పెరిగింది కనుక్కోవచ్చు. ఇవే ఆరోగ్యానికి, ప్రతిభాశీలతకు చిహ్నములు.

**5. సూర్యభేధన ప్రాణయామము :-** ధ్యానముద్రలో కూర్చోవాలి. శరీరముపై బట్టలు తక్కువగా వుంచుకోవాలి. తూర్పుకు తిరిగి అరుణోదయకాలములో కూర్చోవాలి. ఆత్మశక్తి శరీరమును వదలి సూర్యలోకము చేరినట్లుగా భావించాలి. ఏ విధముగా సూదిలో గుచ్చిన దారము బట్టలనుండి వెళుతుందో, మండే అగ్నిలో పెట్టిన ఇనుప చువ్వ అగ్నిని ఛేదించుకుని వెళ్ళిపోతుందో, అదే విధముగా ఆత్మచేతన ప్రాతఃకాలీన సూర్యుని వేధన చేసుకుంటూ అటూ ఇటూ వెళుతోంది. సూర్యుని ఊర్జ చేతనలో నిండుతోంది. కుడి ముక్కు ద్వారా పీల్చబడిన శ్వాస లోపలికి వెళ్ళి సూర్య చక్రమును ఆందోళితము, వుత్తేజితము చేస్తున్నది. ఓజస్సు, తేజస్సు, వర్చస్సును ఎక్కువ పరిణామములో తనలో ధరించి తిరిగి ఎడమ ముక్కు ద్వారా అన్ని కల్మషాలను వదిలివేస్తుంది. ఇంతకు ముందుతో పోలిస్తే ఇప్పుడు ప్రాణఊర్జ అధికమైనది. అది ప్రతిభా పరివర్ధన రూపములో అనుభవములోకి

వస్తుంది. క్రియను తక్కువ చేసి, భావమును ప్రధానముగా తీసుకొని ఈ అభ్యాసమును నియమిత రూపములో చేస్తే నిశ్చయముగా ఫలిస్తుంది.

**6. అయస్కాంత స్పర్శ :-** అయస్కాంత చికిత్స చాలా గొప్పదిగా చెప్పబడింది. ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్, సూక్ష్మసంస్థానములను ముద్రా బంధముల ద్వారా ప్రభావితము చేయుట వీటికి అయస్కాంత చికిత్సతో అద్భుత సామ్యముంది. మన పృధ్వి ఒక పెద్ద అయస్కాంతము. దీనికి అవసరమైనవరకు ప్రాణమును ఉత్తరధృవము నుండి లాక్కుంటుంది. అనావశ్యక కల్మషాలను దక్షిణధృవము నుండి వదలివేస్తుంది. అయస్కాంత స్పర్శలో కూడా ఇదే విధానము ప్రయోగింపబడుతుంది. సహజసామర్థ్యము గల అయస్కాంతము మొదట మెల్ల మెల్లగా మస్తిష్కము, హృదయము మీద ఎడమనుండి కుడికి తిప్పబడుతూ వుంటుంది. వేగము నెమ్మదిగా వుండాలి. కంఠము మొదలుకొని నాభి ఛిద్రములపైకి వెళుతూ జననేంద్రియముల వరకు అయస్కాంతశక్తి చేరుతుంది. స్పృశించి తిప్పిన తరువాత దానిని కడిగివేయాలి. ఎందుకంటే దానిమీద ఏ ప్రభావమూ పడకూడదు. అయస్కాంత ప్రభావిత జలము, విద్యుదయస్కాంత ప్రయోగము ఈ వరుసలోనే చేయబడతాయి. ఏ లోటుకి, ఏ పద్ధతిని, ఏ విధముగా ప్రయోగించాలి? దాని నిర్ధారణ ప్రయోగాలు విశేషజ్ఞుల ద్వారా చేయబడుతుంది.

**7. ప్రాణవంతుల సాన్నిధ్యము :-** శక్తిపాతము యొక్క తాంత్రిక విధానము చేయుడం, చేయించడం చాలా కష్టసాధ్యము, బాధాకరమైనది కూడా, కానీ వరిష్ఠులైన ప్రాణచేతనా సంపన్నులైన వ్యక్తులకు దగ్గరగా వెళ్ళుటకు ప్రయత్నము చేయుట చాలా సులువు.



దగ్గరగా వుండి చరణస్పర్శ వంటి పనుల ద్వారా లాభమును పొందవచ్చు. అప్రత్యక్ష రూపములో హనుమంతుడు, భగీరథునివంటి ప్రాణవంతులతో భావనాత్మక ఏకరూప ధ్యానము చేస్తే పరస్పరము ఇచ్చిపుచ్చుకునే శృంఖల మొదలవుతుంది. సబ్బు ఎలా తెల్లదనాన్నిస్తుందో, మురికిని పోగొడుతుందో అదే విధముగా ఈ భావన ద్వారా సఘన సంపర్కము పెటుకొనుటకు వుపయోగించ వచ్చు. దృశ్యచిత్రములు ఆ మహామానవుల కర్తవ్యములను, గుణములను చింతించుటకు సహాయపడతాయి. అమ్మ స్థన్యపానమువలన - బాలకుడు, గురువు యొక్క శక్తిని పొందుతూ - శిష్యుడు ఎలా లాభాన్వితుడవుతాడో ఈ ఆధారముగానే ప్రాణచేతన పెరుగుతూ వుంటుంది.

**8. నాదయోగము :-** వాద్యయంత్రముల మరియు వాటి శబ్ద తరంగములకు తమ తమ ప్రభావమున్నది. వాటిని కోలాహలము లేని స్థలములలో వినడము, అభ్యసించడము జరిగినచో ప్రతిభాసంవర్ధన జరుగుటలో సహాయపడతాయి. ఈ పని శబ్దశక్తితో (ఇది చేతనకు ఇంధనము వంటిది), శ్రవణశక్తితో, అంతర్ ఊర్జా కేంద్రములను వుత్తేజితము చేసి లేపుట సంభవమౌతుంది. టేపురికార్డరు సంగీతము విని కూడా ఈ పని చేసుకోవచ్చు మరియు వుచ్చస్తరీయ మంత్రములు లేదా సంగీతము పైన కూడా ధ్యానము చేసుకోవచ్చు. మనకు వుపయుక్తమైన సంగీతము ఎన్నుకోవడానికి విశేషజ్ఞుల ద్వారా నిర్ధారించుకోవాలి. ఒకే వాద్యము లేక సమయానుకూలమైన రాగమును ఎన్నుకోవాలి. దీనిని ప్రారంభములో ఐదు నుండి పది నిమిషాలు చేసుకోవాలి. క్రమముగా ఈ అభ్యాసమును పెంచుకోవాలి. విభిన్నస్థాయి వ్యక్తులకు తగిన సంగీత శబ్దముల ఎన్నిక

చేసి వాటి ఆధారముగా శాంతికుంజ్‌లో క్యాసెట్లు తయారుచేయబడుతున్నాయి.

**9. ప్రాయశ్చిత్తము :-** వ్యభిచారము, మోసము, ధనాపహరణ వంటి దుష్కర్మలు ప్రాణశక్తిని క్షీణింపచేసి ప్రతిభను తగ్గిస్తాయి. ఈ దుష్కర్మలు పోగొట్టుకోవడానికి ప్రాయశ్చిత్తము చేసుకోవాలి. క్రిష్టియన్ ధర్మములో కన్ఫెషన్‌కు చాలా పెద్ద విలువ వుంది. దుష్కర్మలను చేయకుండా మంచి కర్మలు చేయాలి. చాంద్రాయణవ్రతము వంటి వుపవాసములు ఈ భారమును తగ్గించేందుకు సహాయపడతాయి. ఎవరు ఏ దోషమునకు మారుగా ఏ ప్రాయశ్చిత్తము చేసుకోవాలనేది గురుసత్తావంటి విశేషజ్ఞులు నిర్ణయించాలి. వారికి పూర్తి విషయమును చెప్పినచో మనోభారము కూడా తేలికపడుతుంది. తరువాత ఏమి చేయాలి అనేది తెలుస్తుంది. ప్రాయశ్చిత్తమనేది ఏ తప్పును ఎలా శుభ్రపరచాలి అనే ప్రక్రియ, ఇది మనోవైజ్ఞానికుల ఆవశ్యకతను పూర్తి చేస్తుంది. ప్రతిభాసంవర్ధన కొఱకు అంతరంగమును శుభ్రపరచుకొనుట కూడా చాలా అవసరము.

**10. అంకురముల కల్కము మరియు వనౌషధుల సేవనము :-** అన్నము, ధాన్యములు మరియు వనమూలికలకు, వనస్పతులకు తమతమ ప్రభావముంది. అంకురస్థితి లో వాటికి కొత్త మరియు అతిరిక్త గుణములు వుంటాయి. తమ ఆవశ్యకతలననుసరించి వీటిని నిర్ధారించుకోవాలి. తనకు నిర్ధారించబడిన దానిని ఏడు గోలాలలో రోజు విడిచి రోజు నాటాలి. 7 వ రోజు ఆ అంకురములను చితక్కొట్టి దాని కల్కము మూడు మాశలు ఒక తులము నీళ్ళల్లో కలిపి ప్రాతః కాలము ఖాళీపొట్టతో తేనె లేక వుచితమైన అనుపానముతో తీసుకోవాలి. ఇది టానిక్ వలె తేజస్సు యొక్క అభివృద్ధి, మేధావృద్ధి, జీవనీశక్తి



సంవర్ధనలో సహాయపడుతుంది. ఈ ప్రకారము ఎండని వనమూలికలు లేదా పొడిచేసిన వనౌషధులను కషాయముగా చేసి తీసుకోవాలి. ఇది విశేషజ్ఞులు నిర్ధారిస్తారు. కొన్ని పరిస్థితులలో వీటిని బాష్పస్థితిలో అగ్నిహోత్రము ద్వారా నాసికామార్గము ద్వారా తీసుకొనుట అనేది కూడా ప్రధానము.

ఇక్కడ సంక్షిప్తముగా ప్రతిభా సంవర్ధన కొఱకు నిర్ధారించిన పది విధానముల చర్చ జరిగింది. విస్తారముగా వీటిని అందరూ శాంతికుంజ్ వచ్చి శిబిరములలో సమ్మిళితమై ప్రత్యక్షముగా నేర్చుకొనవచ్చు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

మహాపూర్ణాహుతి పుస్తకమాల - 4

# యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము - 2

**ద్వితీయ భాగము**

ప్రథమ ముద్రణ : 2000 ప్రతులు

2008 - ఉగాది

మూల్యము : 10/-

అక్షరకూర్పు : శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీమతి లక్ష్మిగోపాల్, శ్రీమతి వల్లీప్రసాద్

డిజైన్ : వై.హెచ్.ఎస్.ప్రసాద్, హైదరాబాద్.

ప్రకాశకులు : హిందీ: యుగనిర్మాణయోజన,

గాయత్రీ తపోభూమి, మథుర

ముద్రణ మరియు ప్రతులకు :

**గాయత్రి చేతనా కేంద్రము**

అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట్, హైదరాబాద్-500018.

ఫోన్స్ : 040-23700722, 32986922, 09392506888

E-mail : hyderabad.ap.in@awgp.org, info@aswini.com

## క్రాంతిధర్మీ సాహిత్యము యొక్క 20 పుస్తకములు

1.ఇరవైఒకటవ శతాబ్ది - ఉజ్వలభవిష్యత్ - 1 (ఇక్కీస్వీసదీ బనామ్ ఉజ్వలభవిష్య్-భాగ్1)

2.ఇరవైఒకటవ శతాబ్ది - ఉజ్వలభవిష్యత్ - 2 (ఇక్కీస్వీసదీ బనామ్ ఉజ్వలభవిష్య్-భాగ్2)

3.యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము - 1 (యుగ్ కీ మాంగ్ ప్రతిభాపరిష్కార్-భాగ్1)

4.యుగేచ్ఛ - ప్రతిభా పరిష్కారము - 2 (యుగ్ కీ మాంగ్ ప్రతిభాపరిష్కార్-భాగ్2)

5.సత్యయుగ పునరాగమనము (సత్‌యుగ్ కీ వాపసీ)

6.పరివర్తన యొక్క గొప్ప క్షణములు (పరివర్తన్ కే మహాన్ క్షణ్)

7.జీవన సాధన యొక్క స్వర్ణిమసూత్రములు (జీవన్ సాధనాకే స్వర్ణిమ్ సూత్ర్)

8. ప్రతిభల కొరకు మహాకాలుని ఆహ్వానము (మహాకాల్ కా ప్రతిభావోం కా ఆమంత్రణ్)

9. ప్రజ్ఞావతారము యొక్క విస్తారప్రక్రియ (ప్రజ్ఞావతార్ కీ విస్తార్ ప్రక్రియా)

10. నవసృజనము కొరకు మహాకాలుని ఏర్పాట్లు (నవసృజన్ కే నిమిత్త్ మహాకాల్ కీ తైయారీ)

11. నేటి సమస్యలకు రేపటి సమాధానము (సమస్యాయే ఆజ్ కీ సమాధాన్ కల్ కీ)

12. మనఃస్థితి మారితే పరిస్థితులు మారతాయి (మనఃస్థితి బదలే తో పరిస్థితి బదలే)

13. ప్రఖరప్రజ్ఞ - స్రష్ట యొక్క పరమ అనుగ్రహము (స్రష్టా కా పరమ్ ప్రసాద్ ప్రఖర్ ప్రజ్ఞా)

14. ఆద్యశక్తి గాయత్రి యొక్క సమర్ధసాధన (ఆద్యశక్తి గాయత్రీ కీ సమర్ధ్ సాధనా)

15. శిక్షే కాదు విద్య కూడా (శిక్షా హీ నహీ విద్యా భీ)

16. సంజీవనీ విద్య యొక్క విస్తరణ (సంజీవనీ విద్యా కా విస్తార్)

17. భావసంవేదనల గంగోత్రి (భావ్ సంవేదనాఓం కీ గంగోత్రీ)

18. మహిళా జాగృతి అభియానము (మహిలా జాగృతి అభియాన్)

19. జీవన దేవతా సాధన - ఆరాధన (జీవన్ దేవతా కీ సాధనా - ఆరాధనా)

20. సమయదానమే యుగధర్మము (సమయదాన్ హీ యుగ్ ధర్మ్)